AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 4, Issue: 9 June - 2007

مجلة الهلال - ملحق مجلة البشرى (باللغة التلغوية)



ఫీమా దశ వార్షిక ఉత్సవాలు



## డా. ముహమ్మద్ తబ్తబాయితో భేటి

IPC
ISLAM PRESENTATION COMMITTEE

## దృక్పథం



ఈ

# జ్ఞాన దీప్తులను వెలగనివ్వండి







సాంవత్సరిక పరీక్షలు ముగిశాయి. పరీక్షా ఫలితాలు కూడా వచ్చేశాయి. నూతన విద్యా సంవత్సరం కూడా మొదలయింది. భావి భారత నిర్మాణ రథ సారథులయిన విద్యార్థినీ విద్యార్థులు సమధికోత్సాహంతో తమ ఉజ్వల భవిష్యత్తుకు బాట వేసుకోవడానికి నడుం బిగిస్తున్నారు. అటు విద్యార్థులు, ఇటు వారి తల్లిదండ్రులు కూడా భవిష్యత్తుపై తియ్యని కలలు కంటున్న కీలక తరుణమిది! ఊహాలోకాల్లో ఆశా సౌధాలు నిర్మించుకుంటున్న ప్రధాన ఘట్టమిది!!

అయితే కేవలం ఆశలుంటే సరిపోదు. ఆశలు, అభిలాషలకనుగుణంగా ప్రతిభను, పరిమితులను కూడా జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలి. టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తమ పిల్లల మార్కులను, వారి ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని మరీ వారికి కెరీర్ గైడెన్స్ చేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉంది. తమ పిల్లలు డాక్టర్లో, ఇంజనీర్లో, సైంటిస్టులో కావాలని ఆశించటం తప్పు కాదు. అయితే పిల్లల తెలివితేటల్ని, వారి అభిరుచుల్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. పిల్లల ఆసక్తి గురించి పట్టించుకోకుండా కాలేజీలకు డొనేషన్లు కట్టి పిల్లలకు ఇష్టంలేని కోర్సులను వారి నెత్తిన బలవంతంగా రుద్దితే ఆనక భారం తడిసి మోపెడవుతుంది. వెరసి వ్యవహారం బెడిసి కొడుతుంది. అలాగే విద్యార్థులు కూడా తమలోని టాలెంట్‌ను సరిగ్గా అంచనా వేసుకుని తమకు తగిన కోర్సులనే ఎంపిక చేసుకోవాలి.

ఈ సందర్భంగా మేము గల్ఫ్ దేశాలలో చిన్నా చితకా ఉద్యోగాలు చేసుకుంటున్న ప్రవాసాంధ్రులకు, ముఖ్యంగా కార్మికులైన ముస్లిం సోదరులకు ఒక మనవి చేయదలిచాము- హైస్కూలు చదువు పూర్తి చేసుకున్న మీ పిల్లల సౌభాగ్యవంతమైన జీవితానికి పూబాట వేయాల్సిన గురుతర బాధ్యత మీ మీదుంది. విద్య లేమివల్ల మీరెలాగూ ఇక్కడ రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమిస్తూ చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారు. ఈ అవస్థ మీ పిల్లలకు వద్దు. మధ్యలోనే వారి చదువులను మాన్పించి, ఆదరాబాదరాగా వీసాలు తీసి, వారిని ఏ డ్రైవర్‌గానో, హౌస్‌బాయ్‌గానో గల్ఫ్ దేశాలకు పిలిపించాలన్న సంకల్పానికి ఇకనైనా స్వస్తి పలకండి. మీ ఆశలు, ఆశయాలు ఉన్నతంగా ఉండాలి. వాటికి కార్యరూపం ఇవ్వటానికి అకుంఠిత దీక్షతో పని చేయండి. పొదుపరితనాన్ని అలవర్చుకోండి. కాని మీ పిల్లలకు మాత్రం మంచి చదువులు చదివించి వారికి ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించండి. మీరు పడే నిరంతర శ్రమకు సత్ఫలితం మీ పిల్లలకైనా లభిస్తుంది. మీ సంపాదనను స్వల్పకాలిక ప్రయోజనాలకై కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలకై వెచ్చించండి.

విద్యా విషయకంగా మన పిల్లలు మరీ వెనకబడి ఉన్నారు. పరిస్థితుల ఈ స్వరూపాన్ని చక్కదిద్దడానికి ఇతరత్రా ఖర్చులను తగ్గించుకుని విద్యార్జనకై ఎక్కువ మొత్తం కేటాయించాలి. ఖరీదైన భవన నిర్మాణాలపై గల కుతూహలాన్ని 'మానవ నిర్మాణాల' పై, 'ప్రతి భామూర్తుల' పై మళ్లించటం నేటి ఆవశ్యకత అని మరువకండి.



# దైవానుగ్రహం ఈ "నెలవంక"

డా. ముహమ్మద్ తబ్తబాయి కువైట్‌లోని సుప్రసిద్ధ యువ షరీయత్ వేత్తలలో ఒకరు. షరీయతు కళాశాల ప్రిన్సిపాల్. 'షరీయతు వ్యవస్థ: భావ మాంద్యం' అన్న అంశంపై ఆయన థీసిస్ వ్రాశారు. స్థానిక దారుల్ ఇఫ్తా ప్రముఖులలో ఒకరు. 'కువైట్ ఫైనాన్స్ హౌస్' తో ముడిపడిన షరీయతు వ్యవహారాలకు సంబంధించి ప్రధాన సలహాదారుగా కూడా ఉన్నారు. IPC పరిపాలక వర్గం వారు కూడా భవిష్యత్ ప్రణాళికలపై, ప్రాజెక్టులపై తరచూ ఆయన సూచనలను పొందుతూ ఉంటారు. **నెలవంక** అసోసియేట్ ఎడిటర్ మౌలానా ముజాహిద్ ఖాన్ ఉమ్రీ గారు ఈయనతో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలను పాఠకుల ప్రయోజనార్థం ప్రచురిస్తున్నాము.

**- ఎడిటర్**

**అస్సలాము అలైకుం రహ్మతుల్లాహి వ బరకాతుహు-**

వ అలైకుముస్సలాం రహ్మతుల్లాహి వ బరకాతుహు "ఫజ్జల్ యా షబాబ్" (దయచేయు యువకుడా....!)

**తెలుగు భాషలో మేము ప్రచురిస్తున్న ఈ సంచికను మీకు చూపించడానికి, మీ విలువైన సలహాలు గ్రహించటానికి వచ్చాము.**

"అహ్లన్ అహ్లన్" (స్వాగతం, సుస్వాగతం) తెలుగు భాష ఏ ప్రాంతానికి చెందిన భాష....?

**ఆంధ్రరాష్ట్రంవారు తెలుగు భాష మాట్లాడుతారు.... హైదరాబాదు దానికి రాజధాని-**

ఓహ్ హైదరాబాద్! జేన్ (మంచిది). ఈ పత్రిక పేరేమిటి ...? ఇది వార పత్రికా... లేక మాస పత్రికా....?

**ఇది మాస పత్రిక షేఖ్! దీని పేరు "నెలవంక", అంటే "అల్ హిలాల్" అని అర్థం...**

మాషాఅల్లాహ్ ముమ్తాజ్! పేరు చాలా అద్భుతంగా ఉంది. మంచి పేరు ఎంచుకున్నారు- మీ సంపాదక వర్గానికి చెందిన సభ్యులందరికీ నా శుభాకాంక్షలు తెలియజేయండి-

**మీ ప్రోత్సాహానికి కృతజ్ఞతలు షేఖ్ !**

అల్‌హందు లిల్లాహ్... (పొగడ్తలన్నీ అల్లాహ్‌కే సొంతం) అవును, దీని ముఖ్య ఉద్దేశం ఏమిటి సోదరా...?

**ముఖ్యమైన లక్ష్యాలు:-**

**1- ముస్లిమేతర సోదరులకు ఇస్లాం పరిచయం చేయడం, ఇస్లాం పట్ల గల అపోహలను తొలగించటం, వారితో స్నేహపూర్వక సంబంధాలను ఏర్పర్చుకోవటం.**

**2- నవ ముస్లిములకు సాహిత్యపరంగా ఇస్లాం శిక్షణ ఇవ్వటం.**

**3- ఖుర్‌ఆన్ హదీసుల ఆధారంగా ముస్లింలలో ఇస్లాం యొక్క సరయిన అవగాహనను కలిగించటం.**

"అల్లాహ్ యుయీనుకుమ్" (అల్లాహ్ మీకు తోడ్పడుగాక)- కువైట్‌లోని ఎంత మంది ప్రజలు ఈ పత్రిక చదువుతున్నారు?

**రమారమి కువైట్‌లో తెలుగువారు ఒక లక్ష మంది ఉన్నారు. 5000 కాపీలు మేము ముద్రిస్తున్నాము- అన్ని ప్రాంతాల వారికి అందజేయడానికి ప్రయత్నిస్తున్నాము- ప్రజలు కూడా ఎంతో ఆసక్తిగా చదువుతున్నారు. వారి ఉత్తరాలు, ఫోన్ల ద్వారా మంచి రెస్పాన్స్ వస్తోంది.**



తఖబ్బలల్లాహు మిన్‌కుమ్ (అల్లాహ్ మీ కృషిని స్వీకరించుగాక!) ఈ పత్రికలో సాధారణంగా ఎలాంటి వ్యాసాలు వస్తున్నాయి..?

**దర్సె ఖుర్‌ఆన్, దర్సె హదీసు, ప్రవక్త (స) వారి పవిత్ర జీవితం, ధర్మ సందేహాలు, ఉమ్మహాతుల్ మోమినీన్ (విశ్వాసుల మాతలు) ధారావాహిక వ్యాసాలుంటాయి. ఇంకా ధార్మిక, సామాజిక పరమైన వ్యాసాలు కూడా ఉన్నాయి.**

సోదరా! మీ పత్రిక చూసి చాలా సంతోషం కలిగింది. విలువైన విషయాలతో పాటు పత్రికను చక్కగా ముస్తాబు చేసి కువైట్‌లో నివసిస్తున్న తెలుగు ప్రజలకు అందిస్తున్నారు. ఇది ఓ గొప్ప వరం. నెలనెలా అందజేస్తున్నందుకు, మీ సభ్యులందరికీ మరొకసారి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పత్రిక తెలుగువారి హృదయ స్పందన కావాలని, వారి వైజ్ఞానిక, ఆధ్యాత్మిక దాహాన్ని తీర్చే అమృతవర్షిని అవ్వాలని, వారి ఐహిక, పారలౌకిక జీవితం కోసం మార్గదర్శనం, విజ్ఞాన జ్యోతి అవ్వాలని దుఆ చేస్తున్నాను.

**సార్! మీ అమూల్యమైన సమయాన్ని, సలహాలను మాకందించినందుకు కృతజ్ఞులం. మీ శుభాశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ఆశిస్తున్నాము. జజాకల్లాహు ఖైరన్ (అల్లాహ్ మీకు మంచి ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక!).**

# ఏకేశ్వరోపాసకురాలైన ఓ నా చిట్టి చెల్లీ! బైబిల్‌ని ఎలా చదవమంటావమ్మా?

(సాధారణంగా ఇలాంటి వ్యాసాలకు మేము నెలవంకలో చోటు కల్పించము. ఏ మతస్థులైనా సరే, వారి మతభావాలు చాలా సున్నితమైనవి. వాటిని మేము పూర్తిగా గౌరవిస్తాము. అయితే పాశ్చాత్య భావజాలానికి లోనైన కొందరు ముస్లిం రచయిత (త్రు) లు మితిమీరిన ఉదారవాదం (Permissiveness) తో ముస్లిం సముదాయంలో గందరగోళాన్ని సృష్టించటానికి యత్నించినప్పుడు - తమకు తెలిసిందే సర్వస్వమనుకునే ఈ కూపస్థ మండూకాలను వాస్తవ జగతిలోనికి వెలికి తేవలసిన నైతిక బాధ్యత కూడా మా మీదుంది. ఆ ఉద్దేశ్యంతోనే మా సంపాదక వర్గ సహచరులు మౌలానా **సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ** ఈ మేరకు స్పందించారు.
-ఎడిటర్)

సవూదియాకి చెందిన రీమ్ సాలెహ్ అనే రచయిత్రి కువైట్‌నుండి వెలువడే 'సియాసత్' అనే దిన పత్రికలో 'నువ్వు బైబిల్ చదువు - వాళ్ళను ఖుర్‌ఆన్ చదవని', అన్న మకుటంతో ఒక వ్యాసం వ్రాసింది. ఆమె వ్యాస మకుటం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటే ఆమె మక్కా మదీనాలున్న దేశస్థురాలన్న విషయం మరింత ఆశ్చర్యానికి గురి చేస్తూ ఉంది. అయినప్పటికీ ఎంతో మర్యాద పూర్వకంగా ఆమెకు విన్నవించుకునేది ఏమిటంటే......?

(1) దైవ ప్రవక్త అయిన ఈసా (ఏసు అలైహిస్సలాం) పై అవతరించిన సువార్త ఎక్కడ, మనం దాన్ని చదవడానికి? పౌలు పేర్కొన్న ఇన్‌జీలుల్లాహ్ (దేవునిసువార్త) ఎక్కడ, మనం దాని నుండి గుణపాఠం నేర్చుకోవడానికి?? 120 సువార్తల్లోంచి 4 సువార్తలని ఎంచుకున్న క్రైస్తవుల్ని నాలుగు సువార్తలను మినహాయించి మిగతా 116 సువార్తలను ఖూడిద పాలుచేసిన మతాధికారుల్ని పూర్తి చిత్తశుద్ధి పరులని ఎలా నమ్మాలి??? ప్రవక్త ఈసా (అ) కేవలం దైవ సందేశహారుడు మాత్రమే, ఆయన దేవుని దాసుడు మాత్రమేనన్న విషయాన్ని మరుగు పరచి ఆయన్ని దైవంగా, దైవ అవతారంగా, దైవం దగ్గర వాక్యం, వ్యాక్యాన్నే దైవంగా నమ్మి, అందరినీ నమ్మబలుకుతున్న వారి మాటల్ని ఎలా నమ్మాలి????

(2) "దైవ ప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) గారి జీవితాన్ని వివరించడంలో గానీ, ఆయన బోధనల్ని పేర్కొనడంలో గానీ, ఆయన శిలువ మరణం గురించి వివరణ ఇవ్వడంలోగానీ, ఆయన వంశావళి విషయంలోగానీ, తిరిగి మళ్ళీ బ్రతికి లేచిన సంఘటన విషయంలో గానీ అనేక భిన్న కథనాలు గల సువార్తలను ఎలా చదవాలి? నాలుగు సువార్తలు వ్రాసినవారు; మేము ఈ సువార్తల్ని నేరుగా దైవం నుంచి గ్రహించి వ్రాయటం లేదు. ఇది మా స్వయం కృషితో స్వీయ పరిశోధన ద్వారా వ్రాస్తున్నది మాత్రమే" అంటున్నారు. అలాంటి గ్రంథాల్నా మీరు చదవమంటున్నది?

(3) చర్చీ వ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకి అయిన, ఏసు గారి శిష్యులను తప్పు పట్టిన, వారి విశ్వాసాన్నే శంకించిన పౌలు ఉత్తరాన్ని ఎలా చదవమంటావు? అతను ఏసుగారిని చూడనైనా చూడలేదు. ఏసు (ఈసా అలైహి) ను దేవుడు సజీవంగా తన వైపునకు ఎత్తుకున్న ఎన్నో సంవత్సరాల తరువాత వచ్చిన ఇతను తనను ఏసుగా సంబోధించుకోవడమే కాక దేవుడు తనతో మాట్లాడుతాడని, తాను పరిశుద్ధాత్మతో సంభాషిస్తానని కూడా ప్రగల్భాలు పలికాడు.

(4) భిన్న వ్యాఖ్యానాలు గల ఈ నాలుగు సువార్తల్ని పరిశుద్ధాత్మ ప్రవక్త ఏసు వద్దకు తీసుకు వచ్చాడు అన్న మాటకి నీవు ఏ విధంగా భాష్యం చెప్పగలవు?




5) బైబిల్లోని పాత నిబంధనల్లోను, కొత్త నిబంధనల్లోను మంచి విషయాలు లేవని కాదు, ఉన్నాయి. అయితే అనేక విషయాలు అసహ్యంగా కూడా ఉన్నాయి. ఎలా చదవాలి? ఒకవేళ చదివినా అందరిముందూ ఎలా చదవమంటారు? పోనీ ఈ భాగాలను మీరు మీ చెల్లి కూతుళ్ళకు చదివి వినిపించగలరా? దైవ గ్రంథమంటే ఒకరు చదవలేని విధంగా ఇంత హీనంగా కూడా ఉంటుందా?

చూడండీ! రాజ కుమార పుత్రికా, నీ పాదరక్షలతో నీవెంత అందముగా నడుచు చున్నావు? నీ ఊరువులు శిల్పకారి చేసిన ఆభరణ సూత్రములవలె ఆడుచున్నవి. నీ నాభీ దేశము మండలాకార కలశము. సమ్మిళిత ద్రాక్షరసము. దానియందు వెలితి పడకుండును గాక!
నీ గాత్రము పద్మాలంకృత గోధుమరాశి.
నీ యిరు కుచములు (వక్షోజాలు) జింకపిల్ల లయి తామరలో మేయు ఒక కవలను పోలి యున్నవి.

నీ నేత్రములు జనపూర్ణమైన హెష్బోను పట్టణమున నున్న రెండు తటాకములతో సమానములు... నా ప్రియురాలా, ఆనందమైనవాటిలో నీవు అతి సుందరమైనదానవు.అతి మనోహరమైనదానవు. నీవు తాళవృక్షమంత తిన్నని దానవు. నీ కుచములు గెలలవలె నున్నవి. తాళ వృక్షము నెక్కుదుననుకొంటిని. దాని శాఖలను పట్టుకొందుననుకొంటిని. నీ కుచములు ద్రాక్ష గెలలవలే నున్నవి. నీ శ్వాస వాసన జల్దరుఫీల సువాసనవలే నున్నది. నీ నోరు శ్రేష్ఠ ద్రాక్షా రసమువలెనున్నది. (పరమ గీతము:- 7:1-9)

'సహోదరీ, ప్రాణేశ్వరీ, నీ ప్రేమ ఎంత మధురము! ద్రాక్షరసము కన్నా నీ ప్రేమ ఎంతో సంతోషకరము' (పరమ గీతము:- 4:10)

ఈ కామకేళిని దైవ వాణిగా ఎలా నమ్మ మంటారు?

"నా పరుపు మీద రత్న కంబళ్ళను ఐగుప్తు నుండి వచ్చు విచిత్రపు పనిగల వారదుప్పట్లను నేను పరచియున్నాను. నా పరుపు మీద బోళము, అగరు కారపు చెక్క చల్లియున్నాను. ఉదయము వరకు వలపుదీర తృప్తి పొందదము రమ్ము. పరస్పర మోహము చేత చాలా సంతృప్తి నొందుదము రమ్ము. పురుషుడు ఇంటలేడు. దూర ప్రయాణము వెళ్ళియున్నాడు. అతడు సొమ్ము సంచి చేత పట్టుకొని పోయెను. పున్నమినాటి వరకు ఇంటికి తిరిగిరాడు". ( (సామెతలు:- 7:16-20)

"బెన్యామీనీయులను చూచి - మీరు వెళ్ళి ద్రాక్ష తోటలలో మాటున నుండి షిలోహు స్త్రీలు నాట్యమాడు వారితో కలిసి నాట్యమాడుటకు బయలుదేరగా, ద్రాక్ష తోటలలో నుండి బయలుదేరి వచ్చి పెండ్లి చేసుకొనుటకు (ఇతర భాష బైబిల్లో పెళ్ళి చేసుకొనుటకు అన్నది లేదు) ప్రతివాడునూ

షిలోహు స్త్రీలలో ఒకదాని పట్టుకొని బెన్యామీనీయుల దేశమునకు పారిపోవుడి". (న్యాయాధి పతులు:- 21: 20-21)

"ఆమె అత్తయైన నయోమి..... ఇదిగో యీ రాత్రి అతడు కళ్లమున యవలు తూర్పార బట్టింప బోవుచున్నాడు. నీవు స్నానము చేసి తైలము రాచుకొని నీ బట్టలు కట్టుకొని ఆ కళ్లమునకు వెళ్ళుము, ...... అతడు పండుకొనిన తరువాత అతడు పడు కొనిన స్థలమున గుర్తెరిగి లోపలికి పోయి అతని కాళ్ళమీద నున్న బట్టతీసి పండుకొనవలెను; నీవు చేయవలసిన దానిని అతడు నీకు తెలియజేయునని ఆమెతో అనగా - ఆమె - నీవు సెలవిచ్చిన దంతయు చేసెదనని చెప్పి..." ( (రూతు:- 3:1-8)

ఇవే కాక ఇటువంటి అనేక కథనాలు బైబిల్‌లో అడుగడుగునా దర్శనమిస్తాయి. కొన్ని ఉదాహరణలు: ప్రవక్త దావూద్ (అ) స్త్రీ లోలుడని, స్త్రీలతో చూపులు కలపడం తనకు ఇష్టమని, తన పొరుగువాని (అల్లాహ్ మన్నించుగాక) భార్యతో వ్యభిచరించారని, ప్రాజ్ఞ వయసుకు చేరుకోని లేతమొగ్గల ప్రక్క తప్ప తనకు నిద్రపట్టేదికాదని, ప్రవక్త సులైమాన్ (అలైహి) అవిశ్వాసులై పోయారని, విగ్రహాల ముందు మోకరిల్లారని, ప్రవక్త లూత్ (అ) తప్ప తాగి తన సొంత కుమార్తెలతో వ్యభిచరించారని, దానివల్ల దైవ శిక్ష నుంచి రక్షించబడిన సౌశీల్యవంతులైన విశ్వాసురాళ్ళు గర్భవతులయ్యారని, ప్రవక్త ఇబ్రాహీం (అ) గారు తన భార్యను రాజుకిచ్చి గొప్ప సంపదకులయ్యారనీ, హూదా అనే ప్రవక్త తన కోడలితో శయనించారని..... ఇలాంటి ప్రజలకు ఏమాత్రం పనికిరాని కథనాలతో బైబిల్ నిండివుంది. ఇటువంటి వ్యర్థ కథనాల్ని దైవ వాణిగా నమ్మాలా? ఇలాంటి కథనాల్ని చదవాల్నా?!


ఆ తరువాత ఏకేశ్వరోపాసకురాలైన చెల్లెమ్మతో విన్నవించుకునేది ఏమిటంటే.. నాలుగు సువార్తల్లో ఏ ఒక్క చోటైనా ప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) (అ) తన్ను తాను దేవునిగా, దైవాంశ సంభూతునిగా చెప్పుకున్నారా?- ఆదం చేసిన పాపానికిగాను తాను మానవ మోక్షం కొరకు వచ్చానని యేసు (ఈసా) ఎక్కడైనా పేర్కొన్నారా? నేను ముగ్గురిలో ఒకణ్ని అని ఒక్క మారైనా చెప్పివున్నారా? ధర్మశాస్త్రాన్ని అనుసరించాల్సిన అవసరం లేదనిగానీ, ధర్మశాస్త్రాన్ని అనుసరించడం మూలంగా ఎవరైనా మోక్షం పొందగలుగుతారని భావించినవారు నన్ను విశ్వసించలేదు అని ఏమూలనైనా పేర్కొన్నారా?

**చెల్లెమ్మా!**

మార్పుచేర్పులకి లోనైన బైబిల్‌లోగల దైవ గుణగణాలు ఎలాంటివి? వారి వద్ద దేవుడు ఏడుస్తాడు. ప్రజలు తన్ను విస్మరించినందుకు దేవుడు బాధపడతాడు. మనిషిని, సృష్టిని ఎందుకు సృష్టించానా అని పశ్చాత్తాపడతాడు. దేవుడు దిగంబరంగా నడిచివెళ్ళాడు. దేవుడు కన్నీళ్ళు పెట్టుకుంటాడు. దేవుని ముక్కు నుంచి పొగ వెలువడుతుంది. ఆయన నోటి నుండి నిప్పులు కక్కుతాడు. అగ్నిజ్వాలలు వెలువడుతాయి. నేనెందుకు నాశనమైపోలేదా.. అని తన్ను తాను నిందించుకుంటాడు. ఆయనకు గోచర అగోచర విషయాలగురించి బొత్తిగా తెలియదు. ఆయన కుస్తీలో ఓడిపోతాడు. ఓ చిన్న ఉదాహరణ:

"తాను భూమి మీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను..... నేను వారిని సృష్టించినందుకు సంతాపమునొంది యున్నాననెను". (ఆది కాండము: 6:5-8) అలాగే వారి ప్రవక్తల్లోని ఓ ప్రవక్త - దైవాన్ని సింహాసనంపై గొర్రెపిల్ల ఆకారంలో కొలువు దీరి వుండటం చూశాడని, ఆ గొర్రెపిల్లకి ఏడు కళ్ళు ఏడు కొమ్ములున్నాయని కథనం కూడా ఒకటుంది.

ఇవి, ఇలాంటి వ్యర్థ కథనాలెన్నో దైవం గురించి బైబిల్‌లో అగుపిస్తాయి. ఇటువంటి వర్ణ చిత్రాలుగల బైబిల్‌ని చదవమంటున్నారా?



దివ్య ఖుర్‌ఆన్ ప్రకారం - ఈ విషయమై రేపు ప్రళయదినాన ఈసా (అ) ను నిలదీస్తాడు దేవుడు. "ఓ ఈసా! నీవు మనుజ జాతితో 'అల్లాహ్‌ను కాదని, నన్నూ, నా తల్లినీ దేవుళ్ళుగా భావించండి ' అని బోధించావా?" అని అడిగినప్పుడు అతను (ఈసా) ఇలా మనవి చేసుకుంటాడు: 'నీవు అత్యంత పవిత్రుడవు! ఏ మాటను అనే హక్కు నాకు లేదో ఆ మాటను అనటం నాకు యుక్తమైన పని కాదు. ఒక వేళ నేను ఆ విధంగా అని ఉంటే, అది నీకు తప్పకుండా తెలిసి ఉండేది. నా మనస్సులో ఏముందో నీకు తెలును. నీ మనస్సులో ఏముందో నాకు తెలియదు. నీవు గుప్తంగా ఉన్న యదార్థాలన్నీ తెలిసిన మహాజ్ఞానివి. నీవు ఆదేశించిన దానిని తప్ప దేనినీ నేను వారికి చెప్పలేదు. అది ఏమిటంటే,'అల్లాహ్‌ను ఆరాధించండి ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. నేను వారి మధ్య ఉన్నంతకాలం వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉంటున్నావు. నీవు సర్వ విషయాలను కనిపెట్టి ఉండేవాడవు". (అల్ మాయిదా - 116-117)

**చెల్లెమ్మా!**

"మనం ఇతర మతస్థులను 'కాఫిర్' అని చెప్పడం ఎప్పుడు మానుకుంటాము? అని నీవు ప్రశ్నించావు?"

ఇంత విశాల హృదయంతో ఆలోచిస్తూ ఉన్న నీకు జోహార్లు. కాకపోతే వారిని అవిశ్వాసులుగా, కాఫిర్‌లుగా పేర్కొన్నది మొదట మనమా? లేక సర్వేశ్వరుడైన అల్లాహ్ వారిని, వారిలాంటి ఇతర విశ్వాసాలు గల వారిని తన గ్రంథంలో ఇలా పేర్కొన్నాడా!? ఆ న్యాయాధిపతి ఇలా సెలవిస్తున్నాడు:

"మర్యం కుమారుడైన మసీహ్‌యే అల్లాహ్" అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడ్డారు. వాస్తవానికి మసీహ్ ఇలా అన్నాడు: ఇస్రాయీలు వంశీయులారా! అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. ఇతరులను అల్లాహ్ భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించేవాడెవడూ లేడు".(అల్ మాయిదా : 72)

'అల్లాహ్ ముగ్గురిలోని ఒకడు' అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినవారు. వాస్తవమేమంటే దేవుడు ఒక్కడే. మరొక ఆరాధ్యుడు లేడు. వారు గనక తమ ఈ మాటలను మానుకోకపోతే, వారిలో అవిశ్వాసానికి ఒడిగట్టిన వారికి వ్యథాభరితమైన శిక్ష పడుతుంది. అయితే, వారు అల్లాహ్ వైపునకు మరలరా? క్షమించు అంటూ ఆయనను వేడుకోరా? అల్లాహ్ అమితంగా మన్నించేవాడు, కరుణించేవాడూనూ

(దివ్యఖుర్‌ఆన్: 5:73,74).

ఎవరినైతే దేవుడు 'కాఫిర్' అని అన్నాడో కాదని మనం ఎలా అనగలం? వారిని సంతోషపరచడానికి దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ వచనాలను తొలగించాలన్నదా నీ ఉద్దేశం? వారు తమ గ్రంథాలని ఎలా భ్రష్టు పట్టించారో అలా మనల్ని కూడా చెయ్యమంటావా? నీవు వ్రాసిన ఈ వ్యాసంతో వారు సంతోషిస్తారని అనుకుంటున్నావా? అలా అనుకుంటే నువ్వు పప్పులో కాలేసినట్లే. ఎందుకంటే వారి మనోభావాల గురించి బాగా గుర్తెరిగిన ఆ సంపూర్ణ జ్ఞానియే ఇలా సెలవిస్తున్నాడు: "నీవు వారి విధానాన్ని అవలంబించనంత వరకు యూదులు, క్రైస్తవులు నీవంటే సంతోషం వ్యక్తం చేయరు".

( అల్ బఖర: 120)

# దశాబ్ద్యుత్సవాలు

# మెగా ఈవెంట్ - 2007




కువైట్‌లోని భారత రాయబారి శ్రీ ఎమ్. గణపతి ఈ సందర్భంగా ఉపన్యసిస్తూ, ఇండియన్ కమ్యూనిటీకి చెందినవారు సుమారు ఐదున్నర లక్షల మంది కువైట్‌లో ఉన్నారని, నిజాయితీ, అంకితభావంతో కూడిన వారి పనితీరు వల్ల కువైట్‌లో వారికి మంచి పరపతి ఏర్పడిందని అన్నారు. ఇతర సముదాయాలతో పోల్చినప్పుడు ఇండియన్స్ వల్ల జరిగే నేరాలు లెక్కలోనికి రావని అన్నారు. Fima కృషిని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. ఒక డజను ముస్లిం అసోసియేషన్లను ఒక సమాఖ్య (ఒకే గొడుగు) క్రిందకు తీసుకురావటం శ్లాఘనీయం అని చెప్పారు.

హక్కుల కోసం జాతిపిత గాంధీజీ నడిపిన సత్యాగ్రహ ఉద్యమం తరహాలోనే నేడు భారత ముస్లింలు న్యాయసమ్మతమైన తమ హక్కుల కోసం 'న్యాయాగ్రహ ఉద్యమం' చేపట్టాలని భారత మాజీ బ్యూరోక్రాట్ శ్రీ హర్ష్ మందర్ (రిటైర్డ్ I.A.S ) పిలుపు ఇచ్చారు. 13-04-2007 తేదీన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ముస్లిం అసోసియేషన్, కువైట్ (Fima) ఆధ్వర్యంలో కువైట్‌లోని ముష్రిఫ్‌లో జరిగిన "మెగా ఈవెంట్ - 2007" వేదిక నుంచి ఆయన ప్రసంగించారు. భారత ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మగ్గుతూ ఉండవలసిన దయనీయ పరిస్థితి ఏర్పడిందని, గుజరాత్‌లోని ఎన్నో ప్రాంతాలలో ఒక వర్గం వారు ముస్లింల పట్ల "అప్రకటిత సోషల్ బాయ్‌కాట్" ధోరణిని అవలంబిస్తున్నారని ఆందోళన వ్యక్తపరిచారు. గుజరాత్ అల్లర్ల (2002) సందర్భంగా ఒక పథకం ప్రకారం, చాలా తెలివిగా అక్కడి దళిత జనులను ముస్లింలపై ఉసిగొల్పి, వారి చేతుల మీదుగానే ఏకపక్ష మారణకాండను సాగించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.








ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారిలో డా. వలీద్ తబ్తబాయి (M.P) తదితరులు కూడా ఉన్నారు. ప్రెసిడెంట్ శ్రీ ఎం.ఏ.కరీం ఇర్ఫాన్ గత పదేండ్లుగా తమ సంస్థ భారత సముదాయాల మధ్య సంఘీభావం కోసం చేసిన ప్రయత్నాలను వివరించారు. 1500 మంది స్త్రీ పురుషులు పాల్గొన్న ఈ మెగా ఈవెంట్‌లో అతిథులను సత్కరించారు. క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి బహుమతులతో పాటు, యోగ్యతా పత్రాలు ప్రదానం చేశారు.

- నెలవంక ప్రతినిధి

ఈ వేదిక నుంచి ప్రసంగించిన భారత అతిథులలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఫాతిమా బీబీ (తమిళనాడు మాజీ గవర్నర్), రాజ్యసభ మాజీ సభ్యులు అబ్దుస్సమద్ సమ్దానీ ఉన్నారు.



# ఆచార్య సంజయ్ ద్వివేది



సేకరణ: షేఖ్ వలీద్ ఉమ్రీ





**నేను** కొన్ని మధుర క్షణాలు మీతో పంచుకో వాలనుకుంటున్నాను. క్రిందటి గురువారం (12/10/ 2006) నా సహోద్యోగి నివాసంలో ఓ చిన్న ఫంక్షన్‌కు ఆహ్వానం అందింది. అతని పేరు మొహ్సిన్ షాబంద్రీ. ఆ ఫంక్షన్ ముహమ్మద్ అబ్దుల్ మునీమ్ గారి సన్మానం నిమిత్తం ఏర్పాటు చేయ బడింది. అహ్మద్ పండిట్‌గా ప్రసిద్ధి చెందిన ఆయన ముస్లింగా ధర్మపరివర్తనం చెందినవారు. పూర్వం ఆచార్య సంజయ్ ద్వివేదిగా సుప్రసిద్ధులు.

ఈయన గురించి చెప్పాలంటే ఈయనకు హిందూ ధర్మంపై, వేదాలపై మంచి అవగాహన ఉంది. హైందవ పరిభాషలో ఆచార్య లాంటి ఉన్నత స్థితికి చేరుకున్నారు. ఆయన తమ ప్రసంగంలో ; ప్రధానమైన నలుగురు పీఠాధిపతుల్లో తాను కూడా ( కంచి శంకరాచార్యలాగా) ఒక స్థానాన్ని సంపా దించుకోగలనని తెలియపరిచారు. 15 వ ఏటనే ఆయన బిర్లా గ్రూప్ దేవాలయాలకు ప్రధాన ఆచా ర్యుడిగా నియుక్తులయ్యారు. అలాగే అఖిల భారత బ్రాహ్మణుల సంఘం **(All India Brahmin's Association)** అధ్యకులుగా ఎన్నికయ్యారు.

ఇక రాజకీయ పరంగా ఆయన కుటుంబీకుల విషయానికొస్తే ఆయన తాతగారు ఎన్. డి. తివారి, ఉత్తరాంచల్ రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి. ఆయన తల్లి శ్రీమతి కమలాదేవి సుమారు తొమ్మిది సంవత్సరాలకు పైగా ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి విద్యా మంత్రిగా ఉన్నారు.

సమావేశంలో ఆయన తన జీవితం, ఇస్లాం వైపు ప్రయాణం ఎలా సాగిందనే అంశంపై వివరంగా సంభాషించారు. తనకు ఇస్లాం వైపు ఏ విషయం దారి చూపింది? అనే అంశంపై సంపూర్ణ వీడియో కూడా లభిస్తుంది. ఇస్లాం స్వీకరించిన కారణంగా తాను ఏం పోగొట్టుకున్నది కూడా తెలిపారు. (సభలో మాట్లాడుతూ; తాను ఏ వివాహానికైనా పురోహితునిగా వెళితే తనకు దాదాపు 51 లక్షల రూపాయల రుసుము లభించేది, హిందువుల్లో అటువంటి స్థాయికి చెందినవారాయన) ఇప్పుడు ఆయన ఓ సాధారణమైన ముస్లింగా జీవిస్తున్నారు. అయినప్పటికీ ఆయన ఇస్లాం ధర్మ ప్రచారం లాంటి గొప్ప బాధ్యతను నెరవేరుస్తున్నారు. ప్రస్తుతం ఆయన "అల్ హిదాయ, హైదరాబాద్ అధ్యక్షులు".

సత్యాన్వేషణలో మీ ప్రయాణం ఎలా ఆరంభ మైంది? అన్న ప్రశ్నకు, ఓ ముస్లిం కుర్రాడు స్కూల్లో దైవాన్ని ప్రార్థించటాన్ని తాను గమనిస్తూ ఉండటమే అంటారాయన. (అహ్మద్ పండిట్ క్రమం తప్ప కుండా స్కూల్‌కి బోర్డ్ పరీక్షలు ఇవ్వటానికి వచ్చే వారు) తను చదువుతున్న స్కూల్లో చాలా కఠినమైన నియమ నిబంధనలు ఉండేవి. ఉదాహరణకు ఏ విద్యార్థి అయినా 5 నిమిషాలు ఆలస్యంగా వస్తే, అతనికి 5 దెబ్బలు పడేవి. ఇమ్రాన్ అనబడే ఓ విద్యార్థి నిరంతరం - ప్రతి రోజు- సాయంత్రం 20 నిమిషాలు ఆలస్యంగా వచ్చేవాడు. తత్కారణంగా అతనికి రోజూ 20 దెబ్బలు పడుతుండేవి. అహ్మద్ పండిట్ ఉపాధ్యాయులతో విచారించగా, "అతనో ముస్లిం కుర్రాడు, అతను ప్రార్థన కొరకు వెళ్ళి ప్రతి రోజూ ఆలస్యంగా వస్తాడు. అతనెప్పటికీ బాగు పడడు" అని వాళ్ళు సమాధానమిచ్చారు. ఇమ్రాన్‌పై కనికరం చూపుతూ అహ్మద్ పండిట్, నీవు స్కూల్ నుంచి తిరిగి వెళ్ళాక నీ ప్రభువుని ప్రార్థించవచ్చు కదా? లేక స్కూల్‌కి రాక కొంచెం ముందు ప్రార్థన చేయవచ్చుకదా? అని ప్రశ్నించగా, క్షమించండి పండిట్‌జీ, మీరు మీ దేవుణ్ణి మీ అదుపులో ఉంచు తారు. మీ దేవుళ్ళను మీ ఆఫీస్‌లలో, ఇండ్లలో ఉంచుతారు, మీకు అనుకూలంగా ఉండే రీతిలో పూజిస్తారు. కాని మా విషయం అలా కాదు. మమ్మల్ని మా ప్రభువు నియంత్రిస్తున్నాడు. ఒకవేళ నేను నిర్ధారిత వేళలో ఆరాధించకపోతే, పరలో కంలో నేను శిక్షింపబడతాను. పరలోకంలో శిక్షను ఇహలోకం శిక్షతో పోల్చితే, ఇహలోకం శిక్ష నాకు ఏమాత్రం బాధ కల్గించదు అని బదులిచ్చాడు ఇమ్రాన్.

ఇమ్రాన్ మాటలు నా లోని సత్యాగ్ని కణాల్ని రాజేశాయి, చివరికి అవే నన్ను ఇస్లాం వైపుకు మరలటానికి కారణమయ్యాయి అని అహ్మద్ పండిట్ చెప్పారు. ఓ సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "నేను ఓసారి ఇమ్రాన్ ఇంటికి వెళ్ళాను. అక్కడ ఇమ్రాన్ తండ్రి ప్రార్థిస్తున్న దృశ్యాన్ని చూశాను. ఇమ్రాన్ తండ్రి సామాన్య మనిషి కారు, భోపాల్ కోర్టుకు ప్రధాన న్యాయమూర్తి ఆయన. సులభంగా లంచం ద్వారా ధనాన్ని కూడబెట్టుకో గలరు. అయినప్పటికి ఆయన నిరాడంబరమైన జీవితాన్ని గడిపేవారు. సాదాసీదాగా ఉండే ఓ పడకగది గృహంలో నివసించేవారు. తమ ఇంట్లో సహోద్యోగులు, న్యాయవాదులు, మరియు ఇతర వృత్తినిపుణుల కొరకు ఖుర్‌ఆన్ బోధనా తరగతులు నిర్వహించేవారు" ఓ విషయం మీరు గుర్తుంచుకోవాలి. అహ్మద్‌పండిట్‌కు నాలుగేండ్లు ఉన్నప్పుడే ఆయన్ని హైందవ విశ్వవిద్యాలయంలో చేర్పించటం జరిగింది. అందువల్ల ఆయనకు బయటి ప్రపంచం గురించి అంతగా తెలీదు. కనుక ఆయనకు ఇస్లాం గురించి కూడా ఏమీ తెలియదు.

"అంకుల్! మీకు అభ్యంతరం ఏమీ లేకుంటే నేను మిమ్మల్ని ఒకటడగొచ్చా?" అని అహ్మద్ పండిట్ ప్రశ్నించారు.

"అడుగుబాబు!" అన్నారు ఇమ్రాన్ తండ్రి. "ఇందాక మీరు చేసినది ఏ రకమైన యోగా?" "నేను యోగా చేయటం లేదు, దైవాన్ని ప్రార్థిస్తున్నాను".

"వేళాకోళం చేయకండి అంకుల్, మీరు చెప్పిన దాని ప్రకారం మీరు దైవాన్ని ప్రార్థిస్తున్నారు; అయితే దేవుడు ఎక్కడా? మీ ఎదుట గోడ తప్ప మరే వస్తువూ లేదు కదా! మేమైతే దైవాన్ని ఎదురుగా పెట్టుకొని ప్రార్థిస్తాము ఆ దైవం వివిధ రంగులతో అలంకరించబడి ఉంటాడు" అని సందేహపడ్డారు. దానికి ఇమ్రాన్ తండ్రి అహ్మద్ పండిట్‌ని ఒకే ఒక ప్రశ్న వేశారు. "మీకు హిందీ భాష బాగా వచ్చా?" "నాకు హిందీ, సంస్కృతంలో మంచి ప్రవేశం ఉంది" అని బదులిచ్చారాయన. అప్పుడు ఇమ్రాన్ తండ్రి ఇంట్లోకెళ్ళి దివ్యఖుర్‌ఆన్ (హిందీ అనువాదం) తీసుకొనివచ్చారు. అహ్మద్ పండిట్ గారికిచ్చి, దాన్ని చదవండి అన్నారు.

పరీక్షలు అయ్యాక అహ్మద్ పండిట్ తమ గురుకుల ఆశ్రమానికి తిరిగి వెళ్ళారు. అది విద్యార్థుల కొరకు ప్రత్యేకించబడిన ప్రత్యేక స్థలమని, అనుమతి లేకుండా అక్కడికెవ్వరూ రాలే రని ఆయన తెలిపారు. ఆయన వీలు చూసుకొని ఖుర్‌ఆన్ పఠించటం మొదలెట్టారు. దివ్య ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు తనలో ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నం అయ్యాయి. వేదాలలో చదివిన కొన్ని పదాలు, వాటిని సరిపోలిన పదాలు దివ్యఖుర్‌ఆన్‌లో కూడా ఉన్నాయని తెలుసుకున్నారు.

(మిగతా 20వ పేజీలో)



# శుభోదయ కిరణాలు

ఆధారం : అర్రహీఖుల్ మఖ్తూమ్

సంక్షిప్తీకరణ: సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ



## హిరా గుహాలో

ప్రవక్త (స) గారి వయస్సు 40 సంవత్సరాలకు దగ్గరవుతుండగా అల్లాహ్ ఆయన కోసం ఏకాంతాన్ని ప్రియంగా చేశాడు. తరచూ ఆయన సత్తుపిండి, నీళ్ళు తీసుకుని మక్కాకు రెండు మైళ్ళదూరంలో వున్న నూర్ పర్వతంపై హిరా అనే ఓ గుహాలోకి వెళ్ళేవారు. రమజాను మాసమంతా ఆ గుహాలోనే ఆరాధన, అనుశీలనల్లో, సృష్టి రహస్యాలను పరికించడంలో, ప్రకృతిపై చింతన చేయటంలో మునిగిపోయేవారు. నిత్యం తన జాతివారిలో తిష్టవేసిన విగ్రహారాధనలాంటి దురాచారాలను గురించి, వారి నైతిక దుస్థితి గురించి తీవ్రంగా ఆలోచించేవారు. ప్రవక్త (స) గారి ఈ ఏకాంతం కూడా అల్లాహ్ సూచనల్లోని ఓ సూచనే. దైవ దౌత్యానికి మూడు సంవత్సరాల ముందు నుండి అల్లాహ్ ప్రవక్త (స) కోసం ఈ ఏకాంతాన్ని సమ్మతించాడు. ప్రవక్త (స) ఈ ఏకాంతంలోనే నెలలు గడిపేవారు. బ్రహ్మాండమైన ఈ విశ్వ కర్మాగారం వెనుక వున్న ఆ శక్తి ఏది? మానవుల ఆ నిజస్వామిని ఆరాధించే సరైన పద్ధతి ఏది? వీటిపైనే ఆయన తన మనస్సును కేంద్రీకరించారు? దైవేచ్ఛతో చివరికి ఆ ఘడియ రానే వచ్చింది.

## జిబ్రయీల్ దైవవాణి తీసుకొస్తున్నారు

దైవ ప్రవక్త (స) గారికి 40 యేండ్లు నిండాయి. అప్పుడు దైవ దౌత్య సూచనలు ప్రస్ఫుటం అవసాగాయి. దివ్యకాంతులు విరజిమ్మసాగాయి. ఆ సూచనలు ఆయన గారి కలలు. ఆయన చూసే ప్రతి కళ ప్రభాకరుని లేకిరణంలా నిజమయ్యేది. ఈ పరిస్థితి ఆరు నెలలవరకు కొనసాగింది. ఈ కల దైవ దౌత్యపు నలభై భాగాల్లోని ఓ భాగం. అది రమజాన్ మాసం. ఎప్పటిలాగే ఆయన దైవధ్యానంలో లీనమై వున్నారు. హిరా గుహాలో ఆయన ఏకాంతవాసపు మూడవ సంవత్సరం అది. దైవ దూత జిబ్రయీల్ (అ) దైవవాణికి సంబంధించిన కొన్ని దైవ వచనాలను తీసుకొచ్చారు. అధిక శాతం పండితుల కథనం ప్రకారం ఖుర్ఆన్ అవతరణ రమజాను మాసం 21వ తేదీన జరిగింది. హిరాలో ప్రవక్త (స) ముందు ప్రత్యక్షమైన హజ్రత్ జిబ్రయీల్ 'చదువు' అన్నారు. దానికి ఆయన 'నేను చదువుకోలేదు' అని సమాధానం ఇచ్చారు. (గట్టిగా అదిమి వదిలి) మళ్ళీ 'చదువు' అని పురమాయించారు. ఆయన మళ్ళీ 'నేను చదవలేను' అని పలికారు. మళ్ళీ జిబ్రయీల్ ఆయన్ని గట్టిగా అదిమి వదిలి 'చదువు' అని కోరారు. 'నేను చదువుకున్న వాణ్ణికాను' అని తిరిగి బదులిచ్చారు.

మూడవసారి కూడా జిబ్రయీల్ (అ) అదిమి వదిలి ఇలా అన్నారు: 'చదువు నిన్ను సృష్టించిన నీ ప్రభువు పేరుతో! ఆయన మనిషిని కరడు గట్టిన రక్తంతో సృష్టించాడు. చదువు. నీ ప్రభువు ఎంతో దయాళువు. ఆయన కలము ద్వారా మనిషికి జ్ఞానబోధ చేశాడు. మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు. (అలఖ్: 1-5)

ఈ సంఘటన జరిగిన వెంటనే మహా ప్రవక్త(స) భయాందోళనలతో వణుకుతూ హజ్రత్ ఖదీజా(ర) వద్దకు వచ్చి "దుప్పటి కప్పు దుప్పటి కప్పు" అని అన్నారు. కాస్త శాంతించిన మీదట ఆయన జరిగిందంతా హజ్రత్ ఖదీజా (ర) కు వివరించారు. దానికి హజ్రత్ ఖదీజా (ర) ఇలా ఓదార్పునిచ్చారు; "అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ మిమ్మల్ని పరాభవం పాలు కానివ్వడు. (ఎందుకంటే) మీరు బంధువుల పట్ల, సంబంధీకుల పట్ల బాధ్యతా నిర్వహణలో ఎలాంటి లోటూ రానివ్వరు. ఇతరుల భారాన్ని తమరే మోస్తారు. ఆర్తులను, అనాథలను ఆదుకుంటూ ఉంటారు. అతిథులకు ఉచితరీతిలో మర్యాద చేస్తారు. ఆపదల్లో వున్నవారికి (న్యాయప్రాప్తికొరకు) తోడ్పడతారు".

ఆ తరువాత ఆయన్ని తీసుకొని ఆమె తన పెదనాన్న కుమారుడైన వరఖా బిన్ నౌఫిల్ దగ్గరకు వెళ్ళారు. ఆయన వయసు బాగా పైబడిన పండు ముదుసలి. క్రైస్తవ మతస్థుడు. బైబిల్‌ని బాగా అధ్యయనం చేసినవాడు. మహా ప్రవక్త (స) జరిగిన వృత్తాంతం అంతా వివరించగా, ఆ అద్భుత శక్తి ఎవరో కాదు, ప్రవక్త మూసా (అ) పై అవతరించిన దైవదూతే. ఇప్పుడు నేను పసిబాలుణ్ని అయివుంటే ఎంత బాగుండేది. మీ జాతివారు మిమ్మల్ని బహిష్కరించే ఆ రోజువరకు నేను సజీవంగా ఉంటే ఎంత బాగుండు అని విచారం వ్యక్తం చేశాడు. ఏమిటి? నా జాతివారు నన్ను బహిష్కరిస్తారా? అని ఆశ్చర్యంగా అడిగారు మహా ప్రవక్త (స). 'అవును మీకు లభించిన ఇటువంటి సందేశాన్ని పొంది దాన్ని ప్రజలకు అందజేసిన వారందరిపట్లా ప్రజలు శత్రుత్వమే వహించారు. మీకు ఆ పరిస్థితులు ఎదురయ్యే వరకు నేను జీవించి వుంటే మీకు అండగా ఉంటాను' అని సమాధానమిచ్చాడు వర్ఖా. ఇది జరిగిన కొద్ది రోజులకే ఆయన మరణించాడు.

ఆ తరువాత కొన్ని దినాల వరకు మహా ప్రవక్త ముహమ్మద్ (స) పై దివ్యావిష్కృతి అవతరించడం ఆగిపోయింది. అలా చాలా రోజులయ్యింది. ప్రవక్త (స) దు:ఖ సముద్రంలో మునిగివున్నారు. వహీ ఆగమనానికై ఎంతో ఆత్రుతతో ఎదురు చూడసాగారాయన. ఆ తరువాత కొంత కాలానికి దైవవాణి అవతరించింది. దివ్యావిష్కృతి అవతరించే విధానాలు ఈ విధంగా వుండేవి.

(1) ప్రవక్త (స) గారిపై దివ్యావిష్కృతి తొలి దశలో నిజమైన కల రూపంలో వచ్చేది.

(2) ప్రవక్త (స) పై దివ్యావిష్కృతి అవతరించేటప్పుడు గంట మ్రోగుతున్న శబ్దం విన్పించేది. దాని ప్రభావంతో ప్రవక్త (స) నుదుటిపై విపరీతంగా చెమటలు పట్టేవి. ఎముకలు కొరికే చలిలో సైతం అలానే జరిగేది. ముఖ్యంగా జిబ్రయీల్ వచ్చేటప్పుడు ఈ పరిస్థితి ఏర్పడేది.

(3) ఒక్కోసారి ప్రవక్త (స) ఎదుట దైవదూత మానవాకారంలో ప్రత్యక్షమై సంబోధించేవాడు. మానవాకారంలో ఉన్న దైవదూతను ప్రవక్త (స) గారి సహచరులు సైతం చూసేవారు.

దివ్యావిష్కృతి అవతరణ 23 సంవత్సరాల వరకు సాగింది. అంటే: ప్రవక్త (స) 40 వ ఏట నుండి ప్రారంభమై 63 వ సంవత్సరం ఆయన మరణించేంత వరకూ అవతరిస్తూనే వుంది.

(ఇంకా వుంది)



# విశ్వాసుల మాత
# హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అన్హా)- 3

-అబూ తఫ్‌హీమ్
ipotelugu@rediffmail.com

విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) అందరితోనూ ఉత్తమంగా ప్రవర్తించేవారు. చివరికి తనకు బాధపెట్టిన వారితో కూడా మర్యాదగా మాట్లాడేవారు.

ఇఫ్క్ (నింద మోపిన) సంఘటనలో హస్సాన్ బిన్ సాబిత్ (ర.అ) కూడా ఉన్నారు. (తర్వాత తమ తప్పుని తెలుసుకుని తల్లి ఆయిషా సిద్దీఖా (ర.అ) గారితో క్షమాపణ కోరుకున్నారు. జీవితాంతం ఈ విషయాన్ని తలచుకుని కృంగిపోయేవారు) ఈ సంఘటన హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) ను ఎంతో వ్యాకులపరిచింది. అయినా ఆయన వస్తే ఎంతో మర్యాదగా మాట్లాడేవారు. ఆయన చివరి రోజుల్లో గుడ్డివారైపోయారు. ఒక రోజు హస్సాన్ (ర.అ) వస్తే హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) ఆయనను సగౌరవంగా కూర్చోబెట్టి మర్యాద చేసి పంపించారు.

" ఆయన మీ గౌరవానికి అసలు అర్హుడేనా?" అని కొంతమంది అభిప్రాయపడగా, "హస్సాన్ బిన్ సాబిత్ (ర.అ) ఇస్లామీయ కవి. ఒకసారి మహాప్రవక్త (స.అ) గారి ప్రశంసలో చెప్పిన ఆ ఒక్క కవితే ఆయన మొత్తం జీవిత పాపాలకి పరిహారం" అవుతుందని హజ్రత్ ఆయిషా సిద్దీఖా(ర.అ) సమర్థించారు.

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) కు ముస్లిములకు సంబంధించిన ప్రతి విషయం పట్ల చింతన ఉండేది. కందక యుద్ధ సమయంలో అవిశ్వాసులు మదీనా అంతటినీ ముట్టడించారు. మరో వైపు యూదులు మదీనాలో పన్నే కుటిల పన్నాగాల వల్ల అనుక్షణం ప్రమాదం పొంచి ఉండేది. అంచేత ఆమె స్వయంగా బయటికి వచ్చి పరిస్థితులను పరిశీలించేవారు. ఉహద్ యుద్ధంలోనైతే వీపు మీద నీటి తిత్తులను మోసుకొని వచ్చి ముస్లిం సైనికులందరికీ నీరు త్రాపించారు.

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) మంచి మేధావి. ప్రవక్త (స.అ) గారి ప్రతి మాటను క్షుణ్ణంగా అర్థం చేసుకునేవారు. ఆమె ద్వారా ముస్లిం సమాజానికి, ధర్మానికి సంబంధించిన విషయాలెన్నో తెలిసాయి. ఇమామ్ జుహ్రీ గారి కథనం ప్రకారం "సహాబాలందరిలోనూ హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) గారి విద్యయే ఎక్కువ". ఉర్వ బిన్ జుబేర్ ఇలా అన్నారు; " నేను ఫిఖహ్, వైద్యం, కవిత్వంలో తల్లి ఆయిషా గారి కన్నా ఎక్కువ పాండిత్యం గల వారిని ఎవరినీ చూడలేదు".

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) గారికి అరబీ భాషపై మంచి పట్టు ఉండేది. మూసా బిన్ తల్హా ఇలా అన్నారు: " నేను ఆయిషా (ర.అ) గారిని మించిన సాహితీవేత్తను చూడలేదు". ప్రవక్త ముహమ్మద్ (స.అ) గారిపై దైవవాణి వస్తే ఆయన నుదుటిపై చెమట పట్టేది. ఆ విషయాన్ని హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) గారు ప్రస్తావిస్తూ; "ప్రవక్త (స.అ) గారి నుదుటిపై చెమట బిందువులు ముత్యాల్లా రాలేవి" అని అభివర్ణించారు.

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) ప్రవక్త మహనీయుల (స.అ) వారి దాంపత్య జీవితంలో ఉండటంవల్ల కేవలం ఇస్లామీయ పరిజ్ఞానమే కాకుండా, సందర్భానుసారం ఎంత క్లిష్టమైన పరిస్థితి ఏర్పడినా దానిని చిటికెలో పరిష్కరించే సామర్థ్యం ఉండేది. ప్రజలకు తెలియని విషయాలెన్నో ఆమె ద్వారా తెలిసాయి. ఉదాహరణకు:

- ఫజర్ నమాజులో కేవలం రెండు రకాతుల ఫర్జ్ ఉండటానికి కారణం ప్రజలకు అర్థం కాలేదు. "ఫజర్ నమాజ్‌లో ఖిరాత్ సుదీర్ఘంగా చదువుతారు కాబట్టి, 2 రకాతులే ఫర్జ్ నమాజ్" అని ఆమె అన్నారు .
- అసర్ మరియు ఫజ్ర్ నమాజుల తరువాత ఇతరత్రా నమాజ్ ఎందుకు చదవకూడదని అడిగితే "ఎవరైనా సూర్యోదయం మరియు సూర్యాస్తమయ సమయాల్లో నమాజ్ చేస్తే, అది సూర్య పూజను పోలి ఉంటుందని, అందుకే ఆ సమయాల్లో నమాజ్ చదవకూడదని ఆజ్ఞాపించటం జరిగింద" ని అన్నారు.
- ఓ సందర్భంలో ప్రవక్త (స.అ) " ఖుర్బానీ మాంసాన్ని 3 రోజులకన్నా ఎక్కువగా నిల్వ చేసుకోరాద" ని ఆజ్ఞాపించియున్నారు. అందలి పరమార్థం ఏమై ఉంటుందని సహాబాలు హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) ను అడిగితే " అది ఒక పరిమిత కాలానికి చెందిన ఆదేశం మాత్రమే. ప్రారంభంలో తక్కువ మంది ముస్లిములు ఉండటం చేత తక్కువ మందియే ఖుర్బానీ ఇచ్చేవారు, అందరికీ ఖుర్బానీ మాంసం అందాలని మహాప్రవక్త (స.అ) ఇలా ఆదేశించార" ని తెలియజేసారు.
- హదీసు ఉల్లేఖనాల్లో హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) గారి స్థానం ఉన్నతం. అబూ హురైరా (ర.అ) మరియు అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర.అ) తర్వాత హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) గారి ఉల్లేఖనాలే ఎక్కువ. హజ్రత్ అబూహురైరా (ర.అ) గారి హదీసు ఉల్లేఖనాల సంఖ్య 5374, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ గారి ఉల్లేఖనాల సంఖ్య 2660, అయితే హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) గారి ఉల్లేఖనాల సంఖ్య 2210.

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) హిజ్రత్‌కు 9 సంవత్సరాల పూర్వం జన్మించారు. హిజ్రి శకం 58లో మరణించారు. హజ్రత్ అబూహురైరా (ర.అ) గారు జనాజా నమాజు చేయించారు. ప్రవక్త గారి సతీమణులందరూ 'జన్నతుల్ బఖీ' లోనే ఉన్నారు గాబట్టి మరణానికి ముందు, తనను 'జన్నతుల్ బఖీ' లోనే ఖననం చేయాలని తాకీదు చేశారు.

చివరి ఘడియల్లో ప్రజలు పరామర్శించడానికి వెళ్ళి "ఎలా ఉన్నారమ్మా!" అని అడిగితే "అల్‌హమ్దులిల్లాహ్ బాగున్నాను" అని అనేవారు, "అయ్యో ! నేను రాయినై ఉన్నా బావుండునే" అని బాధతో అంటుండేవారు.

మాతృమూర్తి హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) గారు రాత్రి సమయంలో మరణించారు. ఇంటిలో ఎన్నో దీపాలు వెలిగించటం జరిగింది. లోపలా బయటా అంతమంది స్త్రీలను ఎన్నడూ చూడలేదని సహాబాలు వ్యాఖ్యానించారు. ప్రజలంతా శోకసముద్రంలో మునిగిపోయారు. అందరూ 'నా తల్లి మరణించింది' అంటూ తమ బాధను వ్యక్తపరచారు.

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) గారు మరణించిన వెంటనే తనను ఖననం చేసేయాలని తాకీదు చేసియున్నారు. కాబట్టి ఇషా నమాజ్ తర్వాత 'జన్నతుల్ బఖీ' లో ఖననం చేసారు. 'జన్నతుల్ బఖీ' జనంతో నిండిపోయింది.

**ఇన్నా లిల్లాహి, వ ఇన్నా ఇలైహి రాజివూన్**

(సశేషం)

ఖుర్ఆన్ పాఠం

# మరణాన్ని మరువకండి



-అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

విశ్వ ప్రభువైన అల్లాహ్ సెలవిచ్చాడు:

"ప్రతి మనిషీ మరణం రుచి చూస్తాడు. మీరంతా మీ పూర్తి ప్రతిఫలాన్ని ప్రళయం నాడు పొందుతారు. (ఆ రోజు) నరకాగ్ని నుండి రక్షించబడి స్వర్గంలో ప్రవేశపెట్టబడేవాడు మాత్రమే యదార్థానికి సఫలీకృతుడు. ఈ ప్రాపంచిక జీవితమంతా ఓ మాయా వస్తువు మాత్రమే." ( దివ్య ఖుర్ఆన్-3:185)

## అభిమాన సోదర సోదరీమణులారా!

జనుల్లో కొందరు దేవుని ఉనికిని, దేవుని ఏకత్వాన్ని, పరలోక జీవితాన్ని నిరాకరించారు. మరి కొందరు దైవ సందేశహరుల్ని, దైవ గ్రంథాలను తిరస్కరించారు కాని మరణాన్ని ఎవరూ కాదనలేదు, కాదనలేరు కూడా.

"పుట్టిన ప్రతి జీవి గిట్టక తప్పదు" అన్నది జగమెరిగిన సత్యం. అయినా చాలా మంది మరణాన్ని మరచి ప్రాపంచిక వ్యామోహంలో పడిపోయారు. ఇహమే సర్వమని, ఇల్లే స్వర్గమనుకొంటున్నారు. ఫలితంగా తమ జీవిత పరమార్థాన్ని మరచిపోయి పెడత్రోవ పడుతున్నారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.

ఈ జీవితం శాశ్వతం కాదని, ఈ అనుబంధాలు, ఆత్మీయతలు అన్నీ తెగిపోయేవేనని తెలుసుకున్న మనిషి అనుక్షణం జాగ్రత్తగా మసలుకుంటాడు. తన బాధ్యతలను ఉత్తమంగా నిర్వర్తిస్తాడు. నీతికి నిలబడి, నిజాయితీగా వ్యవహరిస్తాడు.

యదార్థమేమిటంటే విశ్వ ప్రభువైన అల్లాహ్ మనిషికి ఈ జీవితాన్ని ఇహలోకంలో ప్రసాదించిన పరీక్షా గడువు. ఈ ప్రపంచం పరీక్షా స్థలం. మరణం అంటే పరీక్ష ముగిసి పోయిందని అర్థం.

కారుణ్య ప్రభువైన అల్లాహ్ తన దాసుల ఆత్మలను ప్రాపంచిక వ్యామోహం నుండి ప్రక్షాళనం చేసి, వారి జీవితాలను మలచాలనే ఉద్దేశంతో పలుమార్లు, పలు చోట్ల మరణాన్ని గుర్తు చేస్తున్నాడు. ఉదాహరణకు:- "ప్రతీ ప్రాణీ మరణం రుచి చూడవలసి ఉంది. తరువాత మీరందరూ మా వైపుకే మరలింప బడతారు." (దివ్య ఖుర్ఆన్-29: 57)

" మీరు ఎక్కడున్నాసరే మృత్యువు మీకు వచ్చి తీరుతుంది. మీరు దృఢమైన భవనాల్లో ఉన్నాసరే." (దివ్య ఖుర్ఆన్- 4: 77 )

" ఏ భూభాగంపై తనకు మృత్యువు రానున్నదో ఏ వ్యక్తీ ఎరుగడు." (31: 34)

"అల్లాహ్ అనుమతి లేనిదే ఏ ప్రాణీ చావజాలదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడే ఉంది." (3: 145)

పాపాత్ములు తాము చేస్తున్న అకృత్యాల కారణంగా చావును ఎన్నటికీ కోరుకోరు. అలాంటివారితో అల్లాహ్ ఇలా అంటున్నాడు:- " ఏ చావు నుండి మీరు పారిపోతున్నారో, అది మీకు తప్పకుండా వచ్చి తీరుతుంది. ఆ తరువాత మీరు- రహస్య విషయాలు, బహిరంగ విషయాలు అన్నింటినీ ఎరిగిన దేవుని ముందు హాజరుపరచబడతారు. అప్పుడు ఆయన మీకు మీరేమి చేస్తూ ఉండేవారో అవన్నీ తెలుపుతాడు." (62: 8)

ఈ సూక్తుల ద్వారా తెలిసిందేమిటంటే, మరణం ఎవరూ త్రోసిపుచ్చలేని ఓ సత్యం. మరణం మనిషికి ఎప్పుడు వస్తుందో? ఎక్కడొస్తుందో? ఎలాంటి స్థితిలో వస్తుందో?? ఎవరూ ఎరుగరు. మరణం వస్తే దాన్ని ఎవరూ ఆపలేరు. మనిషి మరణించగానే అనుబంధాలన్నీ తెగిపోతాయి. మరణించే మనిషి తన వెంట ఏదీ తీసుకొని వెళ్ళడు.

అందుకే "మనిషి ఈ లోకంలో ఒక ప్రయాణీకుడిలా, బాటసారిలా జీవితం గడపాలి" అని దైవ ప్రవక్త (స.అ.సం) వారు అన్నారు. ప్రవక్త మహనీయు (స) ల వారి సహచర్యంలో శిక్షణ పొందిన హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (ర.అ) జనులతో ఇలా అనేవారు: సాయంత్రం గడిపిన తర్వాత ఉదయం కోసం ఎదురు చూడకండి. ఉదయం గడిపిన తర్వాత సాయంత్రం కోసం ఎదురు చూడకండి. వ్యాధికి పూర్వం ఆరోగ్యాన్ని, మరణానికి పూర్వం జీవితాన్ని మహా భాగ్యంగా భావించండి." (బుఖారీ)

ఇంకొక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆపదలకు, కోపాలకు, రోగాలకు భయపడి చావును కోరుకోకూడదు. కొందరు ఆపదలకు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడతారు. ఆత్మహత్య అన్నది మహాపరాధం.

అంతిమ దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:- "మీలో ఎవరూ ఆపదలకు భయపడి చావును కోరుకోకండి. గత్యంతరంలేని పరిస్థితిలో ఇలా వేడుకోండి: 'ఓ అల్లాహ్! నా కోసం జీవితం ప్రయోజనకరంగా ఉన్నంత వరకు నన్ను జీవించి ఉండేలా చెయ్యి. నా కోసం మరణమే ప్రయోజనకరమైతే నాకు మరణం వొసగు." (బుఖారీ-ముస్లిం)

## సోదర సోదరీమణులారా!

మనం జీవిత లక్ష్యం గురించి ఆలోచించకుండా ఐహిక కార్యకలాపాల్లోనే నిమగ్నులమై ఉండకూడదు. మనం ఇక్కడ ఎంత కాలం జీవించినా చివరికి న్యాయశీలుడైన అల్లాహ్ న్యాయ స్థానంలో హాజరు కావలసి ఉందన్న సత్యాన్ని విస్మరించకూడదు. అందరికంటే గొప్ప న్యాయాధీశుడైన అల్లాహ్ తీర్పు దినాన విశ్వసించి, సత్కార్యాలు చేసేవారిని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. తిరస్కారులను, దుర్మార్గులను నరకంలో పడవేస్తాడు. స్వర్గానికి పోయేవారే నిజానికి సఫలీకృతులు.

హదీసు కిరణాలు



మూలం
**రియాజుస్సాలిహీన్**

# ఐహిక అనాసక్తత



తెలుగు అనువాదం
**హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్**

**హజ్రత్ అబూ హురైరా (రజి) చేసిన కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: మీరు (ప్రాపంచిక సిరిసంపదల రీత్యా) మీకన్నా తక్కువ స్థితిలో ఉన్నవారి వైపు చూడండి. అంతేగాని మీకన్నా ఉచ్ఛస్థితిలో ఉన్నవారి వైపు చూడకండి. దేవుడు మీకు ప్రసాదించిన అనుగ్రహాల పట్ల మీరు కృతజ్ఞతాభావంతో ఉండటానికి ఇదెంతో అనువైన పద్ధతి.**

(బుఖారీ-ముస్లిం, వాక్యాలు మాత్రం ముస్లింవి)

### ముఖ్యాంశాలు

ప్రాపంచిక సిరిసంపదల్లో, అందచందాల్లో తమకన్నా మంచి స్థితిలో ఉన్నవారిని చూసినప్పుడు సహజంగానే మనిషి ఈర్ష్యాసూయలకు లోనవుతాడు. దైవానుగ్రహం పట్ల అతనిలో ఒకింత కృతఘ్నతాభావం జనిస్తుంది. ఇలాంటి దుష్టభావాలు జనించకుండా ఉండాలంటే మనిషి తనకన్నా హీన స్థితిలో ఉన్నవారి వైపు కూడా దృష్టి సారిస్తూ ఉండాలి. ఈ రోగానికి ఇదే సరైన చికిత్స. మనం ఒక మామూలు ఇంట్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా జీవితం గడుపుతున్నప్పుడు మనకన్నా ఉచ్ఛస్థితిలో ఉన్న ధనవంతుల సుందర హర్మ్యాలను, ఎత్తైన బంగ్లాలను చూసి న్యూనతా భావానికి లోను కాకూడదు. పైగా మన పరిసరాల్లో మనకన్నా హీన స్థితిలో జీవిస్తున్నవారిని చూసి దేవుడు మనల్ని వారికన్నా మంచి స్థితిలో ఉంచినందుకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఎండల్లో మాడిపోతూ, వానల్లో తడిసిపోతూ చెట్ల క్రింద, రోడ్ల ప్రక్కన బ్రతుకులు వెళ్ళదీస్తున్నవారిని చూసి మనకు ఆ గతి పట్టనందుకు సంతోషించాలి. అంతేగాని ప్రాపంచిక సిరిసంపదల తళుకు బెళుకులను చూసి అసంతృప్తికి లోను కాకూడదు. అయితే దైవభీతి, ధర్మ పరాయణతలాంటి విషయాల్లో మాత్రం ఎల్లప్పుడూ మనకన్నా గొప్పవారినే ఆదర్శంగా తీసుకోవాలి. దానివల్ల మనలో కూడా ధార్మిక చింతన, దైవారాధనా భావాలు పెంపొందుతాయి.

**హజ్రత్ అబూ హురైరా (జ) గారే చేసిన కథనం: నేను డెబ్బయిమంది సుఫ్ఫా మనుషుల్ని (విద్యార్థుల్ని) చూశాను. వారిలో ఎవరిదగ్గరా శరీరానికి చాలినంత వస్త్రం ఉండేది కాదు. ఉంటే లుంగీ ఉండేది లేకపోతే (పొడువాటి) దుప్పటి ఉండేది. దాన్ని వాళ్ళు భుజాల మీది నుంచి చుట్టుకునేవారు. అది కూడా (చాలీ చాలనట్టుగా) పిక్కల వరకు లేదా గిలకల వరకు (వ్రేలాడుతూ) ఉండేది. అచ్ఛాదనం తొలిగిపోతుందేమోనని భయంతో వాళ్ళు ఆ వస్త్రాన్ని జాగ్రత్తగా ముడుచుకుని పట్టుకునేవారు. (బుఖారీ)**

(సహీహ్ బుఖారీలోని ప్రార్థనా స్థలాల ప్రకరణం)

### ముఖ్యాంశాలు

సుఫ్ఫా అంటే అరుగు అని అర్థం. మస్జిదె నబవీ ముందు ఓ అరుగు ఉండేది. ఆ అరుగు దగ్గర దైవ ప్రవక్త వద్ద ధార్మిక జ్ఞానాన్ని ఆర్జించే విద్యార్థులు, సైనిక శికణ పొందే యోధులు ఉండేవారు. వీరిని అహ్లె సుఫ్ఫా (సుఫ్ఫా విద్యార్థులు) అని పిలిచేవారు. సుఫ్ఫా విద్యార్థుల సంఖ్య ఎంతో ఇతమిత్థంగా తెలియదు. ఇస్లాంలో ఇది తొలి పాఠశాల, తొలి సైనిక శిబిరంగా విరాజిల్లింది. నేడు ధర్మజ్ఞానాన్ని అర్జించే విద్యార్థులకు ఈ సుఫ్ఫా పాఠశాలలో ఎంతో గుణపాఠం ఉంది. ప్రవక్త అనుచరులు అన్నపానీయాలకు ప్రాముఖ్యత ఇవ్వకుండా రేయింబవళ్ళు ఆ అరుగు దగ్గరే ఉంటూ కష్టపడి ధర్మ జ్ఞానాన్ని ఆర్జించడంతోపాటు సైనిక శిక్షణ కూడా పొందేవారు.

**హజ్రత్ అబుల్ అబ్బాస్ సహల్ బిన్ సాద్ సాయిదీ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవ ప్రవక్త (స) దగ్గరికి వచ్చి, "దైవ ప్రవక్తా! దేవుడు, ప్రజలు నన్ను అభిమానించాలంటే ఏం చెయ్యాలో చెప్పండి" అని అడిగాడు. "లోకం పట్ల అనాసక్తత చూపు. దేవుడు నిన్ను ప్రేమిస్తాడు. ఆ తర్వాత ప్రజల దగ్గర ఉన్నవాటి పట్ల అనాసక్తత కనబరచు. అప్పుడు ప్రజలు నిన్ను అభిమానిస్తారు" అని సమాధానమిచ్చారు దైవ ప్రవక్త (స).**

( సుననె మాజాలోని ఐహిక అనాసక్తత ప్రకరణం)

### ముఖ్యాంశాలు

'ఐహిక అనాసక్తత' అంటే ప్రాపంచిక జీవన సామగ్రిని పూర్తిగా కాలదన్ని భిక్షాటన చేసుకొని లేదా పస్తులుండి జీవితం గడపమని అర్థం ఎంత మాత్రం కాదు. వాస్తవానికి ఐహిక అనాసక్తత అంటే ధర్మ సమ్మతమైన మార్గాల ద్వారా వచ్చే సంపదపై సంతృప్తి చెందటం, దొడ్డి దోవల్లో డబ్బు సంపాదించకుండా ఉండటం అని అర్థం. మనిషి బ్రతుకు తెరువు కోసం మార్గాలు అన్వేషించకుండా ఉండటాన్ని, ఇహలోకపు సంబంధ బాంధవ్యాలన్నిటిని త్రెంచుకొని ఒంటరి జీవితం గడుపుతూ దేహాన్ని శుష్కించుకోవటాన్ని ఇస్లాం ధర్మం సుతరామూ ఇష్టపడదు. కనుక అవసరం మేరకు ప్రాపంచిక సంబంధాలు కలిగి ఉండటం, జీవనోపాధి కోసం కృషి చేయటం 'ఐహిక అనాసక్తత' కు విరుద్ధం కాదు. పైగా ధర్మ సమ్మతమైన మార్గాల ద్వారా డబ్బు సంపాదించటాన్ని, దాంతో సంతృప్తి చెందటాన్ని ఇస్లాం ఒక 'ఆరాధన'గా పరిగణిస్తుంది.


అయితే మనిషి పరుల దగ్గర ఉన్న సిరిసంపదల కోసం అర్రులు చాచకూడదు. ఎల్లప్పుడూ వాటిపట్ల నిరపేక్షాభావంతో ఉండాలి. ప్రజల ధనం పట్ల అనాసక్తత కనబరచేవాడిని ప్రజలు అభిమానిస్తారు. అలాంటి మనిషికి ప్రజల దృష్టిలో గౌరవప్రదమైన స్థానం లభిస్తుంది. దీనికి భిన్నంగా పరుల ధనం కోసం వెంపర్లాడేవాడిని, ఏ కష్టం చేయకుండా భిక్షాటన చేసేవాడిని ప్రజలు నీచుడిగా చూస్తారు. అలాంటి వ్యక్తి సమాజంలో అప్రతిష్ఠ పాలవుతాడు.

**హజ్రత్ అబూ హురైరా(రజి) గారు చేసిన కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: దిర్హముల, దీనార్ల పూజారి ఒకటి రెండు ఉన్ని దుప్పట్ల పూజారి నాశనమైపోవుగాక! అతను ఈ వస్తువులు దొరికితే సంబరపడతాడు. లేకపోతే అలుగుతాడు. (బుఖారీ)**

(సహీహ్ బుఖారీలోని జిహాద్ ప్రకరణం)

### ముఖ్యాంశాలు

దిర్హములు, దీనార్ల పూజారి అంటే దైవాదేశాలకన్నా ప్రాపంచిక సిరిసంపదలను ఎక్కువగా ఆరాధించేవాడని అర్థం. ఇలాంటి వ్యక్తి రేయింబవళ్ళు ధన సంపాదనలోనే తలమునకలై ఉండి దైవాన్ని మరచిపోతాడు. దేవుణ్ణి పూజించడానికి బదులు ధనాన్నే పూజించడం మొదలు పెడతాడు. ఆఖరికి ఈ ధనపూజే అతణ్ణి వినాశ కూపంలోకి నెట్టివేస్తుంది.




# వివాహిత స్త్రీ తెల్ల చీర కట్టుకోవడంలో తప్పేమీ లేదు

**వివాహితురాలైన స్త్రీ తెల్లని వస్త్రాలు ధరిస్తే ప్రజలు అదోలా చూస్తారెందుకు? దీని గురించి శాస్త్రం (షరీయతు) ఏమంటుంది?**



-ఉమ్మె హానీ (గుల్బర్గా)

వివాహితురాలైన స్త్రీ తెల్లని చీర (లేదా తెల్లని షల్వార్ కమీసు) తొడగటంలో తప్పేమీ లేదు. అరబ్బు దేశాల్లోనైతే కొత్త పెళ్ళి కూతుళ్ళు తళ తళలాడే తెల్లని వస్త్రాలే ధరిస్తారు. మన నాట మాత్రం చాలా మంది దీన్ని వితంతు వస్త్రధారణగా భావిస్తున్నారు. ఇది అర్థం లేనిది.

భర్త చనిపోయిన స్త్రీ ఇద్దత్ ( సంతాప గడువు) ముగిసే వరకు అలంకరణకు దూరంగా ఉండాలని మాత్రమే చెప్పబడింది. ఈ ఆంక్ష అయినా ఇద్దత్ వరకే. జీవితాంతం ఆమె తెల్ల వస్త్రాలు కట్టుకుని ఎలాంటి అలంకరణా చేసుకోకుండా జీవచ్ఛవంలా ఉండాలని ఇస్లామీయ షరీయతు చెప్పలేదు. వాస్తవానికి ఇది సావాస దోషమే. వితంతువులైన స్త్రీలు తెల్లని వస్త్రాలు ధరించాలన్నది హైందవ సాంప్రదాయం. దురదృష్టవశాత్తూ ముస్లిములు కూడా ఈ రివాజును అనుసరించారు. తమకు నచ్చిన రంగుల దుస్తులను ఎంపిక చేసుకునే విషయంలో ఇస్లామీయ షరీయతు స్త్రీలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. అదలా ఉంచితే తెల్ల రంగును దైవ ప్రవక్త (స అసం) ఎంతగానో ఇష్టపడేవారు.

## జీవచ్ఛవాలు

**దివ్య ఖుర్ఆన్‌లోని అల్ ఆలా సూరాలో నరకవాసుల యాతన గురించి ప్రస్తావిస్తూ "వారు చావనూ చావరు. బ్రతకనూ బ్రతకరు" అని అనబడింది. నిజానికి చావన్నైనా చావాలి. బ్రతకన్నైనా బ్రతకాలి కదా! ఈ రెండూ కాకుండా మూడో స్థితి కూడా ఉంటుందా? దీని గురించి సంతృప్తికరమైన సమాధానమిస్తారని ఆశిస్తున్నాము.**

- అమీనుద్దీన్ (నల్గొండ)



తీర్పు దినాన విచారణ జరిగిన తరువాత ప్రజలు స్వర్గ నరకాలలో ప్రవేశించినప్పుడు 'మృత్యువు' ఒక పొట్టేలు రూపంలో ప్రత్యక్షపరచబడి, జిబహ్ చేయబడుతుంది. ఇక మీదట మృత్యువు అన్నది ఎవరినీ కబళించదన్నదానికి అది సంకేతం. స్వర్గవాసులు ఈ పరిణామానికి అమితంగా సంతోషిస్తారు. ఎందుకంటే ఆ క్షణం నుంచి వారికి లభించిన స్వర్గసుఖాలు శాశ్వతమైపోతాయి.

అదే సమయంలో నరకవాసులు తీవ్రంగా ఆత్మనింద చేసుకుంటారు. కారణం: తమకు విధించబడిన నరక శిక్ష శాశ్వతంగా ఉండటమే. ఈ విషయాలు ప్రామాణిక హదీసుల ద్వారా రూఢీ అవుతున్నాయి. (సహీహ్ బుఖారీ: హదీసు నెంబరు- 6548). తేలిందేమంటే నరకవాసులైనా, స్వర్గవాసులైనా శాశ్వతంగా బ్రతికే ఉంటారు. వారికిక మరణం అన్నది ఉండదు.

ఇక మీరు ప్రస్తావించిన అల్ ఆలా సూరాలోని విషయమంటారా, దాని భావం ఇది: వారు (నరకవాసులు) జీవిత మాధుర్యానికి దూరమైపోతారు. వారు బ్రతికే ఉంటారు. అయితే జీవచ్ఛవాల్లా ఉంటారు. దేవుడు మనందరినీ ఆ దురవస్థ నుండి కాపాడుగాక!

## ఖుర్ఆన్ పఠన సమయంలో 'అజాన్' పిలుపు వస్తే.....

**ఒక వ్యక్తి తన ఇంట్లో ఖుర్ఆన్ పారాయణం చేస్తూ ఉంటాడు. ఆ పేటలో అనేక మస్జిద్‌లుంటాయి. నమాజ్ వేళ కాగానే స్వల్ప వ్యవధిలోనే అనేకసార్లు అజాన్ పిలుపు వస్తుంది. అలా 'అజాన్' అయినంతసేపూ ఖుర్ఆన్ పఠనాన్ని ఆపేసి అజాన్ పలుకులకు సమాధానం ఇస్తూ ఉండాల్సిందేనా? ఖుర్ఆన్ పారాయణం చేసే వ్యక్తి ఒకవేళ మస్జిద్‌లో ఉంటే, అతను కూడా ఖుర్ఆన్ పఠనాన్ని విరమించాలా? కొంతమందైతే అజాన్ సమయంలో 'వుజూ చేయటం కూడా ఆపేస్తుంటారు. దీనికి సంబంధించి షరీయతు ఏమంటోంది?**

-నసీరుద్దీన్ (గుంటూరు)



మీరు ఖుర్ఆన్ పారాయణం చేస్తుండగా అజాన్ పిలుపు వినవస్తే పఠనాన్ని ఆపేసి ఆ పలుకులకు సమాధానం ఇవ్వాలి. ఒకవేళ అనేక మస్జిద్‌ల నుంచి 'పిలుపు' వచ్చినట్లయితే మీ పేటలోని (మీ ఇంటికి సమీపంలో ఉన్న) మస్జిద్ అజాన్ పిలుపుకు సమాధానం ఇస్తే సరిపోతుంది. ఆ తరువాత మీ పారాయణాన్ని కొనసాగించవచ్చు.

ఇక మస్జిద్‌లో ఖుర్ఆన్ పఠనం చేస్తున్నవారి విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. పఠనాన్ని ఆపేసి, అజాన్ పిలుపుకు సమాధానమివ్వటమే సమంజసం. ఎందుకంటే, అజాన్ తర్వాత కూడా ఖుర్ఆన్ పఠించవచ్చు. కాని అజాన్ పలుకులకు 'తర్వాత' సమాధానం ఇవ్వడం సాధ్యం కాదు కదా!!

'వుజూ' చేస్తూ కూడా అజాన్ పలుకులకు సమాధానం ఇవ్వవచ్చు. ఎందుకంటే, అజాన్ అవుతున్నప్పుడు 'జవాబు' ఇవ్వాలని ఆదేశించబడింది. కనుక వుజూ చేస్తూ సమాధానం ఇవ్వటంలో తప్పేమీ కనిపించదు.

- అబూ అతీఖ్

## దివ్య ఖుర్ఆన్‌లో

# స్వర్గ నరకాల ప్రస్తావన



- షేఖ్ బిలాల్

విశ్వ సృష్టికర్త, పోషకుడు, పాలకుడు అయిన అల్లాహ్ ఒక్కడేయని విశ్వసించి ఆరాధించినచో సకల శాంతీశుభాలు లభిస్తాయని మనకు ముందు వచ్చిన దైవ గ్రంథాలు తెలియజేశాయి. ఏకేశ్వరోపాసన చేయడంవలన ఈ లోకంలోనే కాక మరణానంతరం పరలోకంలో కూడా మోక్షం లభిస్తుందని తెలియజేశాయి. అలాకాక మనిషి తన ఇష్టప్రకారం నడుచుకొంటూ, తనకు నచ్చిందే ధర్మమని అజ్ఞానంలో జీవిస్తే ఈ లోకంలోనేకాక పరలోకంలో కూడా అవమానానికి గురవుతాడు. స్వర్గ, నరకాల ప్రస్తావన అన్ని కాలాల్లో వచ్చిన ప్రవక్తలైతేనేమి, దైవగ్రంథాలైతేనేమి చేస్తూ వచ్చాయి.

నరకాగ్ని తీవ్రత గురించి ప్రవక్త మహనీయులు (స.అ.స.) ఇలా తెలిపారు: " మీరు (ప్రపంచంలో) వాడే అగ్ని నరకాగ్ని (తీవ్రత) లో డెబ్బయ్యోవంతు మాత్రమే ఉంటుంది". ప్రవక్తగారి సహచరులు ఈ మాటలు విని "(కాల్చి మసి చేయటానికి) ఈ నిప్పే ఎంతో ఎక్కువ కదా?" అన్నారు. దానికి దైవ ప్రవక్త (స.అ.స.) " నిజమే. అయినప్పటికీ ఇహలోకంలోని నిప్పుకంటే నరకాగ్ని 69 రెట్లు ఎక్కువ వేడిగా ఉంటుంది" అన్నారు. (బుఖారీ, ముస్లిం)

నరకం లోతు గురించి దైవ ప్రవక్త (స.అ.స.) వివరిస్తూ ఇలా తెలిపారు: "నరకంలోకి గనుక ఒకరాయి విసిరితే అది దొర్లుకుంటూపోయి నరకం అడుగుకు చేరుకోవటానికి డెబ్బయి ఏండ్లు పడ్తుంది".

అబూ సయీద్ ఖుద్రీ (ర) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (స.అ.స.) ఇలా తెలిపారు: " నరకంలో (అతి తక్కువ పాపం చేసినవారికి) విధించబడే తేలికపాటి శిక్షగా వారి కాళ్ళకు అగ్ని బూట్లు తొడిగించడం జరుగుతుంది. ఆ వేడి కారణంగా వారి మెదడు కుతకుతమని ఉడికిపోతుంది". (బుఖారీ, ముస్లిం)



**దివ్య ఖుర్ఆన్‌లో కొన్ని నరకం పేర్లు తెలుపబడ్డాయి. అవేమంటే :**

- జహీం (భగభగ మండే అగ్ని) (102 : 6)
- హుతమః (తుత్తునియలు చేసివేసే అగ్ని) (104 : 4)
- సయీర్ (భగభగ మండే అగ్నిగుండం) (4 : 10)
- సఖర్ (మిగల్చని, వదిలిపెట్టని అగ్ని) (74 : 26)
- హావియః (లోతైన అగ్ని గుండం) (101 : 9)
- దారుల్ ఫాసికీన్ (దుష్టుల నివాసం) (7 :145)
- దారుల్ బవార్ (దుర్భర నివాస స్థలం) (14 :29)
- మస్వల్ ముతకబ్బిరీన్ (గర్విష్ఠుల పరమ చెడ్డ నివాసం) (16 : 29)
- జహన్నమ్ (నరకం) (9 : 23)

తనను విశ్వసించిన వారికి అనుగ్రహించటమేగాక పరలోకంలో కూడా స్వర్గవనాలను ప్రసాదిస్తానని అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో చాలా చోట్ల తెలిపాడు. స్వర్గం అనే పేరులోనే స్వర్గం యొక్క గొప్పతనం తెలిసిపోతుంది. నీరు, పాలు, తేనె, మధువు ( మత్తు నివ్వని మద్యపానం) మొదలగు నదులను, కాలువలను తన సజ్జన దాసుల కోసం అల్లాహ్ స్వర్గంలో సృష్టించాడు.

స్వర్గానికి 8 ద్వారాలు ఉంటాయి. ఒక ద్వారం వెడల్పు (లోపలి భాగం) గురించి: ప్రవక్త ముహమ్మద్ (స.అ.స.) గారు ఇలా తెలిపారని ఉత్‌బా బిన్ గజ్‌వాన్ (ర) గారు తెలుపుతున్నారు. "స్వర్గంలోని వాకిలి ( లోపలి భాగం) వెడల్పు నలభై సంవత్సరాలు ప్రయాణం చేసినంతదూరం ఉంటుంది".

స్వర్గంలో చిట్ట చివరిగా ప్రవేశించిన వ్యక్తికి ఈ ప్రపంచం కంటే పదింతలు విశాలమైనదీను, ఉత్తమమైనదీ ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేసి చెబుతున్నాడు. ఈ ప్రపంచమే ఇంత అందంగానూ, ఆకర్షణీయంగానూ ఉంటే దీనికంటే పదింతలు మేలైనది, మనసుకు ఆహ్లాదాన్ని ప్రసాదించే ఆ స్వర్గం ఇంకెంత అందంగా ఉంటుందో ఊహించండి!


పచ్చటి కొమ్మలు, రెమ్మలతో శాఖోపశాఖలుగా విస్తరించిన ఉద్యానవనాలవి! ఆ ఉద్యానవనాలలో ఖర్జూరం, దానిమ్మ (మొదలైన) పండ్లు, ఫలాలు పుష్కలంగా ఉంటాయి. పండ్లతోనిండిన చెట్ల రెమ్మలు వంగి ఉంటాయి. అవి దట్టమైన నిత్య హరితవనాలు. సెలయేర్లు పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తూ ఉంటాయి. ప్రతి జాతి ఫలానికి చెందిన రెండేసి రకాలుంటాయి. బంగారు జలతారు అంచులుండే పట్టుపరుపులపై మెత్తటి దిండ్లు పేర్చబడి ఉంటాయి. అత్యంత విలువైన, ఎంతో అపురూపమైన పచ్చటి తివాచీలు పరచబడి ఉంటాయి. ఆ మహా భాగ్యాల మధ్య సిగ్గులొలికించే స్వర్గకన్యలు (సతులు) ఉంటారు. వారు స్వచ్ఛమైన, కడిగిన ముత్యాల్లా అసామాన్య సౌందర్య రాసులు.


**స్వర్గంలోని కొన్నింటి పేర్లను దివ్యఖుర్ఆన్‌లో తెలుపబడ్డాయి. వాటి పేర్లు**


- జన్నతుల్ ఫిర్‌దౌస్ (మహోన్నత స్వర్గం) (23:11)
- దారుస్సలాం (శాంతి నిలయం) (6:127)
- జన్నతుల్ ఖుల్ద్ (శాశ్వత నిలయం) (25:15)
- జన్నతుల్ మావా (శాశ్వత స్వర్గధామం) (32:19)
- జన్నాతు అద్న్ (నిత్యం కళ కళలాడే స్వర్గవనాలు) (9:72)
- జన్నాతి న్నయీమ్ (అనుగ్రహాలభరితమైన స్వర్గవనాలు) (5:65)
- దారుల్ ముత్తఖీన్ (భయభక్తిపరుల గృహం) (16:30)
- దారుల్ ఖరార్ (స్థిర నివాసం) (40:39)
- జన్నతిన్ ఆలియా (అత్యున్నతమైన స్వర్గం) (88:10)
- మఖామున్ అమీన్ (సురక్షిత – ప్రశాంత – స్థలం) (44:52)
- రౌదా (ఉద్యానవనం) (30:15)
- దారుల్ ముఖామః (కలకాలం నిలిచే నిత్యం కళకళలాడుతూ ఉండే నెలవు) (35:35)









# కంటికి కానరాని

ఆంగ్ల మూలం: **హారూన్ యహ్యా**

**మానవ** దేహం కొన్ని ట్రిలియన్ల జీవకణాలతో కూర్చబడివుంది. ఈ సంఖ్య మామూలు సంఖ్య కాదు. వాస్తవంగా ఒక్క ట్రిలియను అన్నదే అసాధారణ సంఖ్య. ప్రతి మానవ శరీరం వంద ట్రిలియన్ల జీవ కణాలు కలిగి వుంటుంది.

కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిన ఒక వాస్తవ విషయం ఏమిటంటే ఈ కణాలు ఎంతో చిన్నవి అవడంచేత మన శరీరాలు మిక్కిలి పెద్దవి కాకుండా ఉన్నాయి. ఈ విషయం అర్థమయ్యేందుకు మనకు ఒక ఉదాహరణ ఏమిటంటే అత్యంత సూక్ష్మమైన ఈ జీవకణాలు మిలియన్ల సంఖ్యలో ఒకే చోట సమూహంగా ఏర్పడితే అవి ఆక్రమించే విస్తీర్ణం అత్యంత చిన్నదైన గుండుసూది మొన భాగం పట్టే స్థలం మాత్రమే!.

అవి మరీ అంత చిన్నవి అవటంవల్లనే ఒక కణం యొక్క ఆకారము నేటికీ అర్థంకాని విషయంగానే వుంది. జీవకణాలు వాటి స్థితిగతులపై శాస్త్ర వేత్తలు నేటికీ పరిశోధనలు చేస్తూనే వున్నారు.

మీ యొక్క మొదటి జీవకణం మీ మాతృ గర్భంలో రెండు కణాల (తల్లి శరీరం నుండి ఒకటి, తండ్రి శరీరం నుండి మరొకటి విడుదలైన కణాల) సంయోగం ద్వారా ఉత్పత్తి చెందింది. ఆ తర్వాత అది అనేక మార్పులు చెందుతూ మరిన్ని కొత్త కణాలు వృద్ధిలోకి వస్తూ మీ శరీరము కొద్ది కొద్దిగా ఒక రూపాన్ని సంతరించుకుంటుంది.

ప్రతి కొత్త కణమూ వేర్వేరు ఆకారాన్ని పొందుతూ కొన్ని రక్తకణాలు గాను, కొన్ని కండరాల కణాలుగాను, కొన్ని చర్మకణాలుగాను, కొన్ని ఎముక మరియు నాడి కణాలుగానూ ఏర్పడతాయి. ఆ విధంగా మన శరీరంలో రెండు వందల రకాల కణాలు చోటు చేసుకుంటాయి.

వాస్తవంగా ఈ కణాలు ఒకే పరిమాణంలో కూర్చబడినా ప్రతి కణమూ తన విధుల్ని తనదైన పద్ధతిలో నిర్వహిస్తుంది.

ఉదాహరణకు కండరాల కణాలు కాళ్ళల్లో నడకకు పరుగుకు గట్టి స్థిరత్వాన్ని ఇచ్చి ఉపకరిస్తాయి. భుజాలనుగాని, మన కాళ్ళనుగాని ఆటల సందర్భంలో మనమెంత మితిమీరి సాగదీసినా అవి ఏ మాత్రమూ చినగవు. అదీ విశేషం!.

ఆకారంలో గుండ్రంగా వుండే రక్తకణాలు దేహానికి అవసరమయ్యే శ్వాసను రక్తనాళాల ద్వారా సరఫరా చేసేందుకు ఉపకరిస్తాయి.




ప్రాణ వాయువును సులభతరంగా రక్తనాళాల ద్వారా సరఫరా చేసేందుకు వీలుగా తమ ఆకారాలను మలుచుకున్న రక్త కణాలకు శతకోటి కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిందే. మరోపక్క చర్మ కణాలు తమ విధినిర్వహణలో భాగంగా ఒకదానితో మరొకటి పెనవేసుకొని ఒక క్రమ పద్ధతిని కలిగి వున్నాయి. దీనివల్ల నీరు, ఇతర సూక్ష్మ క్రిములు సులభతరంగా శరీరంలో జొరబడకుండా చర్మకణాలు పనిచేస్తాయి. ఒక కణం నిర్మాణం ఎంత సంకిష్టమైనదో, మరెంతటి అద్భుతమైనదో తెలుసుకునేందుకు ఒక ఉదాహరణ – ఒక కణాన్ని సకల సౌకర్యాలతో కూడిన మహానగరంతో పోల్చితే ఇందులో శక్తిని ఉత్పత్తి చేయడానికి యంత్ర పరికరాలు, వస్తూత్పత్తి చేసేందుకు కర్మాగారాలు, వస్తు సామగ్రిని నిలువ చేసే గిడ్డంగులు, పదార్థాలు రవాణాచేసే పైపు లైనులు ఇంకనూ శుద్ధి కర్మాగారాలు మరియు ప్రయోగశాలలు వంటివి ఎన్నో ఇందులో కలవు. మన జీవన మనుగడపై కణాలు చేసే దోషము లేని ఈ విధినిర్వహణా పద్ధతికి మనము కృతజ్ఞతలు చెల్లించక మానము.











# బ్రహ్మాండ కర్మాగారం జీవకణం

తెలుగు రూపం: **అమ్జదలీ ఖాన్**



అయితే గుర్తించాల్సిన ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఒక కణం యొక్క పరిమాణాన్ని ఒక నగరంతో పోల్చినప్పుడు అది అనేక చదరపు కిలోమీటర్లలో విస్తరించి లేదు. అది కేవలం ఒక్క మిల్లీమీటర్లో నూరోవంతు విస్తీర్ణం కలిగి వుంది. ఆ విధంగా వివిధ రకాలు గల మొత్తం కణాలు వాస్తవానికి తమ వంతు కర్తవ్యానికి అనుగుణంగా రూపాంతరం చెందుతూ పని చేస్తున్నాయి.

ఎలాగైతేనేమీ ఇవి కలిగివున్న ఆకారాలు గాని, అవి అమలు జరుపుతున్న పనులు గాని వాటంతట అవే నిర్మించబడి, వాటంతట అవే తమ విధులను నిర్వర్తించడంలేదు సుమా! సాంకేతిక రంగంలో కంప్యూటర్లు, కార్లు విమానాలనే పరిశీలించండి. వాటి రూపాలను, పనితనాన్ని దృష్టిలో ఉంచుకొని, వాటికి అనుగుణంగా అవసరమయ్యే పద్ధతిని, ఆకారాన్ని ఎవరో ఒక రూపకర్త నిర్మించినదే! నిర్మాణ సంస్థల సాంకేతిక నిపుణులు, వాటి పని తీరును గురించి బాగా ఆలోచించి తదనుగుణంగా వాటిని రూపొందిస్తారు.

నిశ్చయంగా కార్లు మన సౌలభ్యమైన ప్రయాణాలకుగాను, టెలివిజన్ సెట్లు అత్యుత్తమమైన దృశ్య నాణ్యతను, ధ్వనులను ప్రసారం చేయడానికి దృష్టిలో పెట్టుకొని రూపొందించడం జరిగింది.

ఈ సూత్రం కేవలం సాంకేతిక సాధనాల వరకే పరిమితం కాదు. మొత్తం మిగతా సాధనాలకూ, వస్తువులకూ ఇది వర్తిస్తుంది. నిత్యం మనం ఉపయోగించే బల్లలు, కుర్చీలు, నివసించే భవనాలు, పెన్సిళ్ళు, ప్లేట్లు, గ్లాసులు – అన్నీ ఒక ప్రణాళికా ఫలితమే! ప్రతిదీ ఒక ప్రణాళికతో నిర్మించబడిందే తప్ప యాదృచ్ఛికంగా దానంతట అదే ఉత్పత్తి కాలేదు.

ప్రతి వస్తువుకు ఒక ఆకారాన్ని ఇవ్వడానికి గాని, ఒక రూపాన్ని కల్పించడానికి గాని, వాటిని ఉత్పత్తిలోకి తేవడానికి గాని కావలసిన మూల కారణం మేధా సంపత్తి. ప్రస్తుతం మన శరీర కణాలనే తీసుకుందాం. వీటిని టెలివిజన్లు, ఇతర సాంకేతిక సాధనాలతో పోల్చితే మన శరీరంలోని కణాలు ఇతర సాధనాలకంటే ఎంతో అభివృద్ధి చెందినవి. అంతే కాకుండా ఈ కణాల శాఖలు అసామాన్యమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ జీవిస్తున్నాయి. ఇంతటి చిన్నపాటి కణాల శాఖలు కలిగివున్న అద్భుత పద్ధతులను గురించి వాటిపై పరిశోధనలు జరుపుతున్న శాస్త్రజ్ఞులు, నేటికీ పూర్తిగా తెలుసుకోలేక పోతున్నారు.

జీవుల్లోకెల్లా అత్యంత శ్రేష్ఠజీవి అయిన మానవ మేధస్సు సైతం పరిశోధిస్తున్నా అంతుబట్టని ఇంతటి భారీ ప్రణాళిక ఈ విశ్వంలో ఎలా ఉనికిలోకి వచ్చిందని ఆశ్చర్యపోతున్నారా?

ఈ అద్భుతాలు చాటిచెప్పేదేమిటంటే మన కణాలు ఒక గొప్ప ప్రణాళిక ననుసరించి సర్వోన్నత మేధావి తరపున నిర్మించబడ్డాయి. ఆ గొప్ప మేధస్సును కలిగి వున్న శక్తి ఏది? ఆ అద్వితీయ నిర్మాత ఎవరు? ఇక్కడి కొచ్చేసరికే మానవుడు పిల్లిమొగ్గలు వేస్తున్నాడు. ఆ మాటే దివ్యఖుర్ఆన్ లో ఇలా అనబడింది: "ఓ మానవుడా! ఉదాత్తుడయిన నీ ప్రభువు (గౌరవాదరణల) విషయంలో నువ్వెలా మోసపోయావు? (మరి చూడబోతే) నిన్ను పుట్టించినవాడు, నఖశిఖ పర్యంతం నిన్ను తీర్చి దిద్దినవాడు, తగు విధంగా నిన్ను కూర్చినవాడు, తాను కోరిన ఆకారంలో నిన్ను పొందికగా మలచినవాడు ఆయనే (నీ ప్రభువే) కదయ్యా!" ( ఇన్ఫితార్: 6–8).

## తరతరాల చరిత్ర

# దైవ ధిక్కారులకు బైతుల్

**దైవ ప్రవక్త** మూసా (అలైహిస్సలాం) ఇస్రాయీల్ సంతతి వారిని ఫిరౌనీయుల చెర నుండి విడిపించుకుని పలస్తీనా వైపు సాగిపోతున్నప్పుడు జరిగిన సంఘటనను ఓ సారి  జ్ఞప్తికి తెచ్చుకోండి. ఆయన తన జాతి జనులనుద్దేశించి ఇలా అన్నారు;

> **" ఓ నా జాతి ప్రజలారా ! అల్లాహ్ మీ కొరకు వ్రాసిపెట్టిన పవిత్ర భూమిలో ప్రవేశించండి. వెన్ను చూపకండి. వెన్ను చూపారంటే మీరు ఘోరంగా నష్టపోయి తిరిగివస్తారు." (అల్ మాయిదా : 21)**

ఆనాడు పాలస్తీనా సహా బైతుల్ మఖ్దిస్ భూభాగాన్ని అమాల్ఖా అనే ఒక అరివీర భయంకర జాతి పరిపాలించేది. అందువల్ల బైతుల్ మఖ్దిస్ పవిత్ర భూమిని సాధించాలంటే ఆ దుష్ట జనుల మెడలు వంచటం తప్పనిసరయింది. కాని ఆ జాతి వారితో ధర్మయుద్ధం చేయటానికి ఇస్రాయీల్ సంతతి వారు ససేమిరా అన్నారు. 'ఓ మూసా! నువ్వూ, నీ ప్రభువూ పోయి వారితో యుద్ధం చేయండి. మేము మాత్రం ఇక్కడే కూర్చుని ఉంటాము' అని తెగేసి చెప్పేశారు.

అప్పుడు దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) తన నిస్సహాయ స్థితిని గురించి, తన ప్రభువుకు నివేదించుకున్నారు. అప్పుడు అతని ప్రభువు, "సరే, అయితే ఈ దేశం వారికి నలభై సంవత్సరాల వరకు నిషేధించబడింది. వారు భూమిలో నిలువ నీడ లేకుండా సంచరిస్తారు" అని సెలవిచ్చాడు. ఈ విధంగా ప్రవక్త మాటను ధిక్కరించిన కారణంగా బనీ ఇస్రాయీల్ నలభై ఏండ్ల దాకా అవస్థపడుతూ ఎడారి వాసం గడిపింది. ఇది ఒక రకంగా వారికి శిక్షే. అయినప్పటికీ ప్రవక్త మూసా (అలైహిస్సలాం) ప్రార్థనా ఫలంగా దేవుడు వారికి వెసులుబాటు కల్పించాడు. ఉదాహరణకు: మేఘాల ద్వారా నీడ, మన్న్ – సల్వా అనే ఆహారపదార్థాల అవతరణ, చట్టుబండ నుంచి 12 నీటి ఊటలు జారీ కావటం – ఇవన్నీ వారిపై దేవుని అనుగ్రహాలే. ఈ ఎడారి వాస సందర్భంగానే దైవప్రవక్తలైన మూసా (అలైహిస్సలాం), ఆయన సహోదరుడు హారూను (అలైహిస్సలాం) చనిపోయారు. వారి తదనంతరం దేవుడు యోషే బిన్ నూన్ (అలైహిస్సలాం) ను ప్రవక్తగా చేసి వారివద్దకు పంపాడు. ఎట్టకేలకు ఆయన  ఇస్రాయీల్ సంతతి వారిని ఏకత్రాటిపై నడిపించి బలవత్తరమైన అమాల్ఖా సేనలపై ధర్మ యుద్ధం ప్రకటించారు; బైతుల్ మఖ్దిస్‌ను జయించారు.  చరిత్రలో అదొక మహత్తర ఘట్టం.

హజ్రత్ యోషే (అలైహిస్సలాం) ధర్మయుద్ధం చేస్తూ బైతుల్ మఖ్దిస్ దరిదాపుల్లోకి వెళ్ళినప్పుడు అస్ర్ నమాజ్ వేళ అయింది. మరి కాస్సేపట్లో సూర్యాస్తమయం అవనున్నది. ఆయన సూరుణ్ణి ఉద్దేశించి,

> **"నీవు దైవాజ్ఞాబద్ధుడవు. నేను కూడా దైవాజ్ఞకే కట్టుబడి ఉన్నాను. ఓ దేవా! దీన్ని అస్తమించకుండా అడ్డుకో " అన్నారు.**
>
> సహీహ్ ముస్లిం : హదీసు నెం: 3124)



అంతే ! కాలం స్థంభించింది. సూర్యుడు ఆగిపోయాడు. ఈ లోగా యోషే బిన్ నూన్ (అలైహిస్సలాం) బైతుల్ మఖ్దిస్‌పై విజయ కేతనం ఎగురవేశారు.

### బైతుల్ మఖ్దిస్‌కు సంబంధించి మహాప్రవక్త(స) శుభవార్త

హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్(ర.అ) ఇలా అంటున్నారు: తబూక్ యుద్ధ సందర్భంగా నేను దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళాను. ఆయన (స) ఒక తోలు గుడారంలో విడిది చేసి ఉన్నారు. ఆయన (స) ఇలా అన్నారు: ప్రళయాన్ని సూచించే ఆరు సూచనలను గుర్తుంచుకోండి. అవేమంటే (1) నా మరణం (2) ఆ తరువాత బైతుల్ మఖ్దిస్‌పై విజయం (3) ఆ తరువాత భారీ ఎత్తున ప్రాణనష్టం సంభవించటం (ఉదాహరణకు మెడవాపు వ్యాధి కారణంగా గొర్రెలలో పెద్ద ఎత్తున మరణాలు సంభవిస్తాయి) (4) ఆ తర్వాత ధనం విరివిగా పారుతుంది. ఒక వ్యక్తికి వంద దీనార్లు ఇచ్చినా అతను సంతృప్తి చెందడు. (5) ఆ పైన ఒక ఉపద్రవం పుట్టుకువస్తుంది. ఏ అరబ్బు ఇల్లూ దాని బారి నుంచి సురక్షితంగా ఉండదు. (6) మీకూ – రోమనులకు మధ్య సంధి కుదురుతుంది. కాని వాళ్ళు మోసం చేసి, 80 ధ్వజాల క్రింద ప్రోగై మీపై కయ్యానికి కాలుదువ్వుతారు. ఒక్కో ధ్వజం క్రింద 12 వేల మంది చొప్పున సైనికులుంటారు." ( బుఖారీ – హ.నెం : 3178)



చాటి చెప్పేదేమిటంటే

# మఖ్దిస్‌లో ఉండే హక్కు లేదు

- ఇబ్నె యూనుస్

## ద్వితీయ ఖలీఫా సారథ్యంలో బైతుల్ మఖ్దిస్ విజయం:

దైవప్రవక్త (స) వారిచ్చిన సూచన ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) కాలంలోనే నిజమయింది.సిరియాపై విజయపతాకం ఎగుర వేసిన తమ సేనలను బైతుల్ మఖ్దిస్ వైపు పురోగమించవలసిందిగా ఖలీఫా తమ సేనాధిపతి (అబూ ఉబైదా బిన్ జర్రాహ్) కి వర్తమానం పంపారు. తమ ఖలీఫా ఆదేశాన్ని శిరసావహిస్తూ 5 వేలమంది సైనికులతో ఆయన బైతుల్ మఖ్దిస్ వైపు కదం తొక్కారు. ఆ కాలంలో అది 'ఏలియా' గా వ్యవహరించబడేది. ఆయన జోర్డాన్ చేరుకోగానే కొంతమంది దూతల ద్వారా ఏలియా వాసుల పేర ఒక లేఖ పంపారు. ఆ లేఖలోని పలుకులు ఇవి:

“ఏలియా మతాధిపతులకు, ఏలియా దేశ వాసులకు అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజి) వ్రాయునదేమనగా, “ సన్మార్గాన్ని అవలంబించి, అల్లాహ్‌ను విశ్వసించి, అల్లాహ్ సందేశహరుని(స) సందేశాన్ని స్వీకరించిన ప్రతి ఒక్కరికీ శుభమవుగాక!

**“లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్”** గురించి సాక్ష్యమివ్వవలసిందిగా మేము మిమ్మల్ని కోర్తున్నాము. ప్రళయం రావటం తథ్యమని, దేవుడు ప్రతి ఒక్కరినీ సమాధి నుండి తిరిగి లేపుతాడని మేము మీకు సావధాన పరుస్తున్నాము. మీరు గనక ఈ విషయాలను ఒప్పుకుంటే మీ రక్తం, మీ సిరిసంతానాదులు మా కొరకు నిషిద్ధం (పవిత్రం) అయిపోతాయి. మీరు మా సహోదరులైపోతారు. ఒకవేళ మీరు గనక ఈ విషయాలను త్రోసిరాజంటే మీరు పరాజితులై మాకు 'జిజ్‌యా' చెల్లించుకోవలసి ఉంటుంది. ఒకవేళ మీరు దీన్ని కూడా నిరాకరిస్తే బాగా తెలుసుకోండి ! నేను మీ వద్దకు తీసుకు వచ్చిన సైన్యం ఎటువంటిదంటే అది ఎట్టి పరిస్థితిలోనూ వెన్నుచూపదు. మీకు మద్యపానం, పంది మాంసం ఎంత ఇష్టమో వీరికి వీరమరణం అంతే ఇష్టం ! మిమ్మల్ని కడతేర్చే దాకా, మీ పిల్లలను ఖైదీలుగా పట్టుకునే దాకా నేను తిరిగి వెళ్ళేది లేదు సుమా! ”

ఈ ఉత్తరంలోని మొదటి రెండు ప్రతిపాదనలను కూడా ఏలియా వాసులు నిరాకరించారు. తత్కారణంగా అబూ ఉబైదా (రజి) బైతుల్ మఖ్దిస్‌ను దిగ్బంధం చేశారు. సుమారు 40 రోజుల వరకూ ఈ ముట్టడి కొనసాగింది. ఎట్టకేలకు ఏలియా వాసులు రాజీకి వచ్చారు. అయితే ముస్లిముల ఖలీఫా స్వయంగా తమ దేశానికి వచ్చి సంధి పత్రంపై సంతకం చేయాలని షరతు పెట్టారు. అబూ ఉబైదా ఈ విషయాన్ని ఖలీఫాకు తెలియపరచగా, ఖలీఫా తన సహచరులను సంప్రతించిన మీదట బైతుల్ మఖ్దిస్‌కు బయలుదేరారు.

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) బైతుల్ మఖ్దిస్‌కు వెళుతున్నప్పుడు మార్గ మధ్యంలో ఒక వాగును దాటవలసి వచ్చింది. ఆయన ఒంటె దిగి తన పాదరక్షలను తీసి భుజాలపై ఉంచుకున్నారు. ఒంటె పగ్గం పట్టుకుని వాగు దాటుతున్నారు. హజ్రత్ అబూ ఉబైదా(రజి) ఈ దృశ్యాన్ని చూసి, “ ఓ అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకా!) ! మీకు ఎటువంటి పరిస్థితి దాపురించింది! ఈ స్థితిలో ఏలియా వాసులు తమరిని చూస్తే అది మాకు సంతోషకరం కాదు సుమా! ” అన్నారు.

దానికి హజ్రత్ ఉమర్(రజి) ఎలా స్పందించారో చూడండి.

> **“ఇది మువ్వాల్సిన మాట కాదు. మరచిపోకు! ఒకప్పుడు మనం కడు నికృష్ట స్థితిలో ఉండేవారం. అల్లాహ్ ఇస్లాం ద్వారా మనకు గౌరవం ప్రసాదించాడు. ఇప్పుడు మనం ఇస్లాం కాకుండా ఇతరత్రా పోకడల ద్వారా గౌరవం కోసం ప్రాకులాడామంటే అల్లాహ్ మనల్ని పరాభవానికి లోను చేస్తాడు."**
>
> **(ముస్తద్రక్ హాకీమ్)**

ఎట్టకేలకు బైతుల్ మఖ్దిస్‌లో హజ్రత్ ఉమర్‌కి–ఏలియా వాసులకి మధ్య ఒప్పందం కుదిరింది. ఖలీఫా సంతకం చేశారు. ఒప్పందం ప్రకారం బైతుల్ మఖ్దిస్ ముస్లింలకు అప్పగించబడింది. అక్కడి క్రైస్తవులు ముస్లింకు 'జిజ్‌యా' చెల్లించసాగారు. దీనికి బదులుగా ఏలియా వాసుల ధన ప్రాణాలను, ఆస్తి పాస్తులను కాపాడే బాధ్యతను ముస్లింలు స్వీకరించారు. ఒప్పందం ప్రకారం ఏలియా వాసులు ఇస్లాం ధర్మాన్నయినా అవలంబించవచ్చు. లేదా తమ పాత మతధర్మంపైనయినా ఉండవచ్చు. అయితే బైతుల్ మఖ్దిస్‌లో ఏ ఒక్క యూదుడూ స్థానిక క్రైస్తవులతో కలిసి ఉండకూడదు.

ఈ ఒప్పందానికి సాక్షులుగా ఉన్నవారిలో ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, ముఆవియా బిన్ అబూసుఫ్యాన్ (రజి) ముఖ్యులు.

ఈ విధంగా బైతుల్ మఖ్దిస్ విజయానికి సంబంధించి మహాప్రవక్త(స) ఇచ్చిన శుభవార్త నిజమయింది. మస్జిదె అఖ్సా తిరిగి ముస్లింల స్వాధీనమయింది.

- ఆ తర్వాతేం జరిగింది?
- శిలువ యుద్ధాలు **(Crusades)** ఎందుకు జరిగాయి?
- బైతుల్ మఖ్దిస్ పునః ప్రాప్తికై సలాహుద్దీన్ అయ్యూబీ నిర్వహించిన భూమిక ఎటువంటిది?

ఈ ప్రశ్నలకు సమాధానం వచ్చే సంచికల్లో...





అయిన్రె

# అదిగో, అతడే

## సుశిక్షణ

ఒక నిజమయిన ముస్లిం సుశిక్షణకు మొదటి మెట్టు ఏమంటే అతను ఏ పనిని సత్ఫ్రదమయిందని భావిస్తాడో దాన్ని నెరవేర్చి తీరాలి. యదార్థానికి అతను కార్యరంగంలో అడుగుపెట్టి, దైవదాసుల సమక్షంలో క్రియాత్మకంగా సత్యసాక్ష్యం ఇవ్వనంతవరకూ సహజమయిన సత్ఫలితాలను పొందలేడు. ఈ కార్యానికి పూనుకున్న తర్వాతనే అతనికి సత్యవంతులయిన దోస్తుల అండదండలు లభిస్తాయి. కార్యరంగంలోకి వచ్చిన తరువాత విరోధులను కూడా ఎదుర్కొనవలసిరావచ్చు. ఈ అనుకూల, ప్రతికూల పవనాల మధ్య అతను రాటుదేల్తాడు. ఎంత కాలితే అంతే కుందనంలా, మేలిమి బంగారంలా మెరిసిపోతాడు. దోస్తులతో కలసి అతను కార్యాచరణ పథకాన్ని రూపొందిస్తాడు. ప్రత్యర్థుల దుష్ట వ్యూహాలను ఛేదించే ఉపాయాలను ఆలోచిస్తాడు. "అవసరాలే ఆవిష్కరణలకు అమ్మ" అన్నట్లు ఈ ఆలోచనలే అతని జ్ఞాన సంపదను ఎన్నో రెట్లు పెంచుతూ పోతాయి. ఆ జ్ఞాన సంపదే అనేకానేక పరిస్థితుల్లో అనేక విధాలుగా అతనికి ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, ప్రత్యర్థులు సృష్టించే అడ్డంకులను, పెట్టే బాధలను సహించే ఓర్పు అతనిలో మెండుగా ఉంటుంది. ఆ విధంగా అతనిలో పరిపూర్ణత, పరిపక్వత వస్తాయి. నిన్నటి వరకూ అతన్ని సతాయించినవారు, చీదరించుకున్నవారు రేపతని ముందు సిగ్గుతో కుమిలిపోయే స్థితి రావచ్చు. సత్యం కోసం నిలకడగా నిలిచిన ప్రతి ఒక్కరూ అంత ఎత్తుకు ఎదిగిపోతారు మరి!

## సద్వర్తనుల సహవాసం

వ్యక్తి సంస్కరణకు మరో అవసరం ఇది. మంచివారి సహవాసం గొప్ప దైవానుగ్రహమని తలంచాలి. చెడు సహవాసుల నుండి మృదువుగా తప్పించుకుని దైవభక్తి పరాయణులు, మచ్చలేని వ్యక్తులతో కలసి మెలసి ఉండే ప్రయత్నం చేయటం అవసరం. తద్వారానే అవాంఛనీయమయిన, వ్యర్థమయిన విషయాల ప్రభావం నుండి తప్పించుకొనడానికి వీలవుతుంది. సజ్జనుల సహచర్యంలో మనిషి తనను తాను సంస్కరించుకొనటమేగాక, తాను నమ్మిన మంచి విషయాలను ఎదుటివారికి బోధించనూగలడు.

క్రమం తప్పకుండా నమాజ్ చేసే ఒక వ్యక్తి నమాజ్ చేయని (బే నమాజీ) వ్యక్తులతో కలసి తిరగటం మొదలెడితే కొన్ని రోజుల తరువాత అతను కూడా వేళకు నమాజ్ చేయటం మానివేస్తాడు. మరి కొన్నాళ్ళు పోతే అసలు నమాజే చేయలేకపోతాడు. చూశారుగా! తన సహవాసుల్ని నమాజ్ వైపుకు పిలువవలసింది పోయి తనే వారి వెల్లువలో కొట్టుకుపోయాడు. కాబట్టి వ్యక్తి నైతిక శిక్షణ కోసం సద్వర్తనుల సహవాసం, మంచి పరిసరాలు కూడా ఎంతో ముఖ్యమని భావించాలి.

ఒక సత్కార్యం సామూహిక స్వరూపాన్ని సంతరించుకుంటే అప్పుడది మరింత ప్రభావవంతం కాగలుగుతుంది. అదీగాక మంచిని ఆదేశించేవారు సుసంగఠితమై ఆ పనిని నిర్వర్తించాలని ఇస్లాం ఆజ్ఞాపిస్తోంది. ఏ విధంగానయితే బొగ్గులపై కూర్చునేవారు మసి పూసుకోకుండా ఉండలేరో, పూల కుప్పల మధ్య కూర్చునేవారు సువాసనల్ని ఆస్వాదించకుండా ఉండలేరో అదే విధంగా చెడు సహవాసం పొందినవారు చెడు ఫలితాలను, సద్వర్తనుల సహవాసం పొందిన వారు సత్ఫలితాలను పొందకుండా ఉండలేరు. సద్వర్తనులంతా కలసికట్టుగా ఓ మంచి పనిని చేబట్టి దాని ద్వారా సమాజానికి -ప్రజలకు- ప్రయోజనం చేకూర్చదలిస్తే సర్వత్రా ఎన్నో శుభాలు వెల్లివిరుస్తాయి, సందేశకులు సంబోధితుల్ని సంస్కరించగోరటం ఎంత సబబో సందేశకులు స్వీయసంస్కరణ చేసుకోవటం కూడా అంతే సబబు. ఆ విధంగా పరస్పర సామూహిక సంస్కరణ జరుగుతుంది. ఒక సహచరుడు క్రిందపడితే మరొకతను చేయూతనిచ్చి నిలబెడతాడు. ఒకతను తన నాయకత్వ బాధ్యతను నిర్వర్తించలేకపోతే రెండోతను దానికోసం సిద్ధంగా ఉంటాడు. ఒకరు ఇంకొకరికి ప్రతిబింబం లాంటివారు. ఒకరిపై ఏదయినా మలిన మచ్చ పడితే వేరొకరు దాన్ని శుభ్రపరుస్తారు. ఒకరి సాఫల్యం ఇంకొకరికి మార్గదర్శకత్వంగా పరిణమిస్తుంది. ఒకరు తన శక్తియుక్తుల సద్వినియోగానికి ఉపక్రమిస్తే తోటివాడు అతనికి సహాయపడతాడు. ఒకరికి ఏదన్నా విషయం సంశయం కలిగిస్తే వేరొకరు దాన్ని నివృత్తిచేస్తారు.

# విశ్వాసి - 4

## ఉత్తముని అన్వేషణ

ధార్మిక విషయాల్లో ఒక ముస్లిం తనకంటే ఎక్కువ జ్ఞాన సంపన్నుడయిన, తనకంటే ఎక్కువ భయభక్తులు, సదాచార సంపన్నత కల వారిపై నిరంతరం దృష్టిని నిలిపి ఉంచాలి. అతని స్థాయికి తానూ ఎదగాలంటే తనలో ఏ ఏ సుగుణాలు పెంపొందించుకోవటం అవసరమో ఆత్మపరిశీలన చేసుకోవాలి. పోతే ప్రపంచ వ్యవహారాల్లో మాత్రం అతను తనకంటే దిగువ స్థాయిలోనున్నవారిని చూడాలి. ప్రాపంచిక విషయాల్లో తనకంటే మంచి స్థితిలోనున్నవారిని చూశాడంటే ఈర్ష్యాద్వేషాలు జనిస్తాయి. అతని స్థాయిని ఎలాగైనా అధిగమించే అత్యాశలో పెడత్రోవలు తొక్కటం మొదలెడతాడు. కనుక ముస్లిం అనేవాడు ధార్మిక విషయాల్లో తనకంటే పై స్థాయి వారిని, ప్రాపంచిక విషయాల్లో తనకంటే తక్కువ స్థాయిలోనున్నవారిని చూడాలనేది ఆజ్ఞ .

సమాజంలోని ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క సుగుణం ఉన్నా దాన్ని గ్రహించి ఆచరించాలి. జాగ్రత్తగా గమనిస్తే నలువైపులా నివసించే తన సోదరుల్లో అసంఖ్యాకమయిన సుగుణాలు మొగ్గ తొడిగినట్లు కానవస్తాయి. ఒకరిలో దైవభావన అధికంగా ఉంటే, మరొకరిలో వినమ్రత మెండుగా ఉండవచ్చు. ఒకరు దైవమార్గంలో అత్యధికంగా ఖర్చు పెట్టేందుకు తహతహలాడుతూ ఉంటే, మరొకరు నిష్ఠా జీవితం గడుపుతుండవచ్చు. ఒకరు దైవనామ స్మరణలో నిమగ్నులై ఉంటే ఇంకొకరు దానధర్మాలు, పరోపకార కార్యక్రమాల్లో మునిగి ఉండవచ్చు. ఒకరు మన్నింపుల వైఖరిని అవలంబిస్తూ దయామూర్తునిగా వర్ధిల్లుతుండగా వేరొకరు రేత్రిళ్ళు అదనపు ఆరాధనల్లో గడుపుతూ ఉండవచ్చు. ఇంకొకరు దైవధర్మ ప్రచార కార్యంలో నిమగ్నులై ఉండవచ్చు. ఈ సుగుణాలన్నింటినీ ప్రోగుచేసి వాటిని తనలో ఇమిడ్చుకోవటం ఒక నిజమైన ముస్లింకు ఎంతో అవసరం.

## మంచిని పెంచాలి చెడుని రూపుమాపాలి

**ఒక ముస్లింపై మోపబడిన బాధ్యతల్లో ఇది ప్రధానమయినది.**

మహనీయ ముహమ్మద్(సఅసం) వారు ప్రబోధించారు : " ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షి! మంచిని ఆదేశించటం, చెడుని నిరోధించటం, దుర్మార్గుని చెయ్యి పట్టుకోవటం, అతన్ని సత్యం వైపుకు మళ్ళించటం మీపై తప్పనిసరి చేయబడింది. అలా జరగకపోతే అల్లాహ్ మీ మనసుల్లోని చెడులను ఒండొకరిపై రుద్దుతాడు. లేదా ఇస్రాయీల్ వంశీయుల్ని ధూత్కరించినట్లు మిమ్మల్ని కూడా ధూత్కరిస్తాడు." ( తిర్మిజీ)

దీన్నిబట్టి తెలిసేదేమంటే ముస్లింలలో 'మంచి' అనే కాంతిని ప్రసరింపజేస్తూ, అన్యాయాన్ని , దౌర్జన్యాన్ని అరికడుతూ ఉండటం అత్యంత అవసరం. ఈ నిరంతర కృషి గనక జరగకపోతే ఆయా కాలపు ప్రజలు అల్లాహ్ ఆగ్రహం నుండి తప్పించుకోలేరు.

## స్వీయసంస్కరణ కూడా ముఖ్యమే

సత్యసందేశ ప్రదాతను సమాజం తరచి తరచి చూస్తుంది. అతనిలోని ఒక్కొక్క లోపాన్ని భూతద్దాలతో పరీక్షిస్తుంది. ఇది లోకం పోకడ కాబట్టి సందేశ ప్రదాత సంబోధితుల ముందుకు వెళ్ళబోయే ముందు తనలోకి ఓ సారి తొంగి చూసుకోవాలి. తనలో లోపాలు పెట్టుకుని ఇతరుల్ని సంస్కరించగోరటం అవివేకం. బలహీనతలకు, లోపాలకు మనిషి అతీతుడు కాడు. కాని వీలయినంతవరకు సందేశ ప్రదాత వాటినుండి దూరంగా ఉండటానికి కృషిచేయాలి. ఏ రుగ్మతలు, మరే చెడుగులనయితే సమాజంలో నుండి సమూలంగా పెకలించాలని వేదికలెక్కి ఉపన్యాసాలిస్తామో ఆ రుగ్మతలు స్వయంగా మనలోనే తిష్ఠవేసి ఉంటే అప్పుడు ప్రజలేమంటారో ఆలోచించండి!

తెలియవచ్చిందేమంటే, సందేశ ప్రదాత కూడా సంబోధితుల నుండి ఎంతో నేర్చుకుంటాడు. 'సత్సమాజం' అనబడే గీటురాయిపై అతను మాటిమాటికీ నిగ్గుతేలవలసి ఉంటుంది. ఈ నిరంతర సంస్కరణ కూడా విశ్వాసి (మోమిన్) స్థాయిని పెంచుతుంది. నిశ్చయంగా సత్యసందేశకునిలో ఈమాన్ (విశ్వాసం) యొక్క అన్ని కోణాలు, అన్ని శాఖలు సమ్మిళితమయి ఉండాలి. వాటిని అతను క్రియాత్మక జీవితంలో నిరూపించుకుంటూ ఉండాలి, దైవ సహాయం ఇలాంటి వారికే లభిస్తుంది.

దాసుడు తన ప్రభువు వైపు నడచి వెళితే కరుణాకరుడయిన ప్రభువు అతని వైపు పరుగెత్తుకుంటూ వస్తాడని విశ్వాసి నమ్మాలి. ఈ నమ్మకమే అతన్ని తీర్చిదిద్దుతుంది.

**కనుక ఓ విశ్వాసీ! నమ్మి నడు. నమ్మి నడు.**

(సమాప్తం)



# ఇస్లామీయ పుస్తకాలయం




**20 భాషల్లో దివ్య ఖుర్‌ఆన్ అనువాదాలు**
**లభ్యమయ్యే ధార్మిక సాహిత్య కేంద్రం**

مكتبة دار التعريف بالإسلام

ఇంకా –
- ఖుర్‌ఆన్ హదీసుల వెలుగులో ప్రామాణిక పుస్తకాలు
- వివిధ టాపిక్‌ల పై CD - DVD లు
- ఫోల్డర్లు, బుక్‌లెట్లు లభ్యమయ్యే షాపును సందర్శించండి

www.ipc-kw.com 301 داخلي 2444117 - 2427383

Fahad Salem St. Al-Mulla Saleh Mosque P.O.Box:1613 Safat 1307
Tel.: 2444117 Ext.: - Fax: 2400057 e-mail:ipb@ipc-kw.com

أَوَلَمْ يَرَوْا إِلَى الطَّيْرِ فَوْقَهُمْ صَافَّاتٍ وَيَقْبِضْنَ ۚ مَا
يُمْسِكُهُنَّ إِلَّا الرَّحْمَٰنُ ۚ إِنَّهُ بِكُلِّ شَيْءٍ بَصِيرٌ



ఏమిటి వారు తమపైన (గగన తలంలో) రెక్కల్ని చాపుతూ, (ఒక్కోసారి రెక్కల్ని) ముడుచుకుంటూ ఎగిరే పక్షుల్ని గమనించడం లేదా? కరుణామయుడైన అల్లాహ్ తప్ప వాటిని ఆ స్థితిలో ఎవరూ నిలిపి ఉంచలేదు. నిశ్చయంగా ప్రతి వస్తువు ఆయన వీక్షణా పరిధిలో ఉంది. (దివ్య ఖుర్‌ఆన్- 67:19)

ఆలోచించండి -

భూమి గురుత్వాకర్షణ శక్తికి, గాలి ఒత్తిడికి
తట్టుకుని గంటల తరబడి గగన తలంలో
విహరించే అపార శక్తియుక్తులను ఈ
తేలికపాటి జీవులకు ప్రసాదించినదెవరు?


IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE


2444117 الخط الساخن : 7600074

...رحمة للعالمين
www.ipc-kw.com

2511301 3810640 3950880 5733263 3820332 4739827 3922237 4558830
6944422 6640206 6044047 7533263 6500590 4711141 7599699 9313514


الكويت، شارع فهد السالم، مسجد الملا صالح، فاكس: 2400057 ص.ب: 1813
الرمز البريدي: 13017 الصفاة - البريد الإلكتروني: info@ipc-kw.com












# ఇంకా ...


## వివిధ అంశాలపై ఎన్నో విలువైన కేసెట్లు, ఫోల్డర్లు ఉచితంగా సరఫరా చేయబడతాయి.










కువైట్ సిటీలోని ఐపిసి హెడ్డాఫీసుతో పాటు,
బ్రాంచ్ ఆఫీసులను కూడా సంప్రదించండి.

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE

2444117
الخط الساخن : 7600074

...رحمة للعالمين
www.ipc-kw.com

2511301 3810640 3950880 5733263 3620332 4735627 3922227 4558830
6944422 6640206 6044047 7533263 6500590 4711141 7599099 9313514

info@ipc-kw.com